Title Code:T/TG/2024/0625/0392/884

# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మనసేత్రం
Follow
పేజీలు 10

గురువారం, అక్టోబరు 23, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## అర్జున అవార్డులపై కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ: భారత క్రీడా రంగంలో అత్యున్నత గౌరవాల్లో ఒకటైన అర్జున అవార్డులు విధానంలో కేంద్ర ప్రభుత్వం తాజా మార్పులు చేసింది. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2025కి సవరించిన కొత్త మార్గదర్శకాలను ప్రకటించింది. వీటి ఆధారంగా అర్హులైన క్రీడాకారులు అర్జున అవార్డు కోసం దరకాస్తు చేసుకునే అవకాశం కేంద్రం కల్పించింది. అర్జున అవార్డు లక్ష్యం  కేవలం విజయాలను గుర్తించడం కోసం మాత్రమే కాదు,  క్రీడాభివృద్ధికి కృషి చేసిన వారిని ప్రోత్సహించడం కోసం కూడా రూపొందించబడింది.  ఇందులో భాగంగా రెండు విభాగాల అర్జున అవార్డులను కేంద్రం అర్హులైన క్రీడాకారులకు ఇచ్చేందుకు సిద్ధమైంది. వాటిలో ఈ రెండు విభాగాలు ఉన్నాయి.

# స్థానికంపై నేడు నిర్ణయం!

### సీఎం అధ్యక్షతన భేటీ కానున్న మంత్రివర్గం

### న్యాయ నిపుణుల సలహాపై చర్చించే చాన్స్!

### ఎస్ఎల్‌బీసీ కాంట్రాక్టు రద్దు ..?

### కాళేశ్వరం టెండర్లకు ఓకే?



హైదరాబాద్: స్థానిక ఎన్నికల నిర్వహణకు ముందుకు వెళ్లే అంశంపై రాష్ట్ర మంత్రివర్గం గురువారం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోలు 9, 41, 42ల అమలును రాష్ట్ర హైకోర్టు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ మధ్యంతర ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విష యం విదితమే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణుల సలహా కోరింది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్య క్షతన సచివాలయంలో గురువారం మధ్యాహ్నం 4 గంటలకు కేబినెట్ సమావేశమై న్యాయ నిపుణులు ఇచ్చిన సలహాపై చర్చించి కీలక నిర్ణయం తీసుకోనుంది. అయితే పాత విధానంలో రిజర్వేషన్లను అమలు చేస్తూ ఎన్నికలు నిర్వహించుకోవచ్చని మధ్యంతర ఉత్తర్వుల్లో రాష్ట్ర హైకోర్టు చేసిన సూచనను అమలు చేయడం తప్ప ప్రభుత్వానికి మరో మార్గం కనిపించడం లేదు. ఇలావుండగా.. ఇద్దరుకు మించి సంతానం కలిగినవారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులని పంచాయతీ రాజ్ చట్టంలో ఉన్న నిబంధనను ఎత్తివేసే అంశంపై మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. ఆ మేరకు చట్ట సవరణ కోసం ఆర్డినెన్స్ జారీ చేసేలా గవర్నర్‌కు ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించనుంది. శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్ఎల్‌బీసీ) సొరంగాల నిర్మా ణ సంస్థ జయప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్‌తో 2005 ఆగస్టు 25న చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫారసులపై కూడా రాష్ట్ర మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకోనుంది. ఒప్పందం రద్దు చేస్తే

(మిగతా 2వ పేజీలో)



## 'దానం సపోర్ట్ చేస్తే తప్పేంటి?.. కొండా వివాదం ముగిసింది' : మహేష్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ బహిరంగంగానే కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వివాదం ముగిసిపోయిందని క్లారిటీ ఇచ్చారు. టీపీసీసీ ఛీఫ్ మహేష్ కుమార్ తాజాగా సాక్షితో మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నేపథ్యంలో మా స్టార్ క్యాంపెయినర్ లిస్టులో దానం నాగేందర్ పేరు ఉంటే తప్పేంటి?. ముసుగులో గుద్దులాటలు అవసరం లేదు.. దానం నాగేందర్ సపోర్ట్ డైరెక్ట్ చేస్తున్నాడు. మా పార్టీకి మద్దతు ఇస్తే తప్పేంటి?. ఫిరాయింపుల అంశాన్ని స్పీకర్ చూసుకుంటారు. జీవన్ రెడ్డి చాలా రోజుల నుంచి అసంతృప్తితో ఉన్నారు. జీవన్ రెడ్డిని త్వరలోనే సెట్ చేస్తాం.



### 'జూబ్లీహిల్స్'పై

## నేడు కేసీఆర్ దిశానిర్దేశం

### ఎర్రవల్లి నివాసానికి వెళ్లనున్న ఉపఎన్నిక ఇన్‌చార్జ్‌లు, స్టార్ క్యాంపెయినర్లు

### ప్రచార ఎజెండాతోపాటు సమావేశాలు, ర్యాలీల నిర్వహణపై సూచనలు

### కేసీఆర్‌తో సమావేశమైన కేటీఆర్, హరీశ్‌రావు

హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజక వర్గ ఉపఎన్నిక నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో బీఆర్ఎస్ పార్టీ ప్రచారపర్వంపై దృష్టి కేంద్రీక రించింది. ప్రచారాన్ని ముమ్మరం చేసేందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. ఎర్రవల్లి నివాసంలో జరిగే ఈ భేటీకి రావాల్సిందిగా పార్టీ అభ్యర్థితోపాటు పార్టీ డివిజన్ ఇన్ చార్జ్‌లు, స్టార్ క్యాంపెయినర్లు, ప్రచారంలో పాల్గొంటున్న కీలక నేతలు, జీహెచ్ఎంసీ కార్పొరేటర్లకు ఆహ్వానం అందింది. గురువారం జరిగే భేటీలో పార్టీ ప్రచార వ్యూహం, సమన్వయం, ప్రచార ఎజెండాపై కేసీఆర్ దిశానిర్దే శం చేస్తారని బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు బుధవారం ఎర్రవల్లి నివాసంలో కేసీఆర్ తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉపఎన్నికలో

(మిగతా 2వ పేజీలో)

# రెండేళ్లలో ఉస్మానియా

### ఉన్నతాధికారులతో బుధవారం తన నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

### కొత్త ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం



హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆసుపత్రి భవన సముదాయాల నిర్మాణాన్ని రెండేళ్లలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. వందేళ్ల అవసరాలకు తగినట్లుగా కొత్త ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలను సమకూర్చుకోవాలని, ఇందుకు సంబంధించి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఉస్మానియా నూతన ఆసుపత్రి నిర్మాణంపై బుధవారం ఆయన తన నివాసంలో సమీక్ష నిర్వహించారు.  ఇప్పటివరకు జరిగిన పనులతో పాటు, ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అధునాతన పరికరాల ఏర్పాటుకు తగినట్టు గదులు, ల్యాబ్‌లు, ఇతర నిర్మాణాలు ఉండాలని, అవసరమయ్యే నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని చెప్పారు. కొత్తగా నిర్మిస్తున్న ఆసుపత్రి ప్రణాళికలో మార్చురీ గది నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం విషయంలో అభ్యంతరం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి.. రోడ్డుకు సమీపంలో ఉండేలా మార్పులు చేయాలని సూచించారు.

#### రోడ్ల పనులు వేగంగా పూర్తి చేయాలి

ఆసుపత్రి చుట్టూ ముందుగా రోడ్లు నిర్మించి, స్థానికులకు ఇబ్బందులు కలగకుండా వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రికి వివిధ రహదారులను అనుసంధానించే ప్రణాళికలు కూడా ఇప్పటినుంచే రూపొందించాలని చెప్పారు. ఆసుపత్రి నిర్మాణ పనుల

(మిగతా 2వ పేజీలో)




## రవాణా చెక్‌పోస్టులు రద్దు

### ఏసిబి నివేదిక ఆధారంగా...

### చెక్‌పోస్టుల స్థానంలో ఏఎన్‌పిఆర్ అడ్వాన్స్ టెక్నాలజీ అందుబాటులోకి..

హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీ సుకుంది. రాష్ట్రంలోని అన్ని రవాణా చెక్ పోస్టులను మూసివేస్తూ ఆ దేశాలు జారీ చేసింది. అక్టోబర్ 22వ తేదీన సాయంత్రం 5 గం టల లోపు మూసివేయాలని ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశా రు. రెండు నెలల క్రితం ఈ చెక్ పోస్టులను మూసివేయాలని నిర్ణ యం తీసుకున్నా వాటిని కొనసాగించడంపై సిఎం రేవంత్ సీరియస్ అ య్యారు. వెంటనే రాష్ట్రంలోని అన్ని ట్రాన్స్‌ఫోర్ట్ చెక్ పోస్టులను మూ సివేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో రవాణా శాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. దీంతోపాటు తాను జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే అమల్లోకి తీసుకు రావాలని రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ ట్రాన్స్‌ఫోర్ట్ కమిషనర్లు, జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చెక్ పోస్టుల దగ్గర ఉన్న బోర్డులు, బారికేడ్లు, సిగ్నేజ్ తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. సిబ్బందిని ఇతర శాఖలకు తిరిగి నియమించాలని చెక్ పోస్టుల దగ్గర ఎవరూ ఉండొద్దని ఆయన సూచించారు. చెక్ పోస్టుల దగ్గర వాహనాల రాకపోకలకు ఎలాంటి

(మిగతా 2వ పేజీలో)

# ఫిరాయింపుల విచారణ తిరిగి షురూ!

### 18 రోజుల విదేశీ పర్యటన నుంచి నేడు నగరానికి స్పీకర్ బృందం

### రేపు స్పీకర్ ఎదుట ఆ నలుగురిపై బీఆర్ఎస్ వాదనలు

### ఈ నెల 30న ముగియనున్న సుప్రీంకోర్టు గడువు

### విచారణ గడువు పొడిగించాలని కోర్టును కోరనున్న స్పీకర్?



హైదరాబాద్: బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల విచారణ తిరిగి ప్రారంభం కానుంది. కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) సదస్సులో పాల్గొనేందుకు విదేశీ పర్యటనకు వెళ్లిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం హైదరాబాద్‌కు చేరుకుంటారు. బార్బడోస్, ఫ్రాన్స్, లండన్, ఇటలీలో స్పీకర్‌తోపాటు మండలి చైర్మన్, వైస్ చైర్మన్, అసెంబ్లీ కార్యదర్శితో కూడిన ప్రతినిధి బృందం 18 రోజుల పర్యటన అనంతరం రాష్ట్రానికి చేరుకుంటోంది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలపై ఈ నెల 30లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గత నెలలో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన స్పీకర్ సెప్టెంబర్ 29 నుంచి అనర్హత పిటిషన్లపై విచారణ ప్రారంభించారు. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని బీఆర్ఎస్ న్యాయవాదులు క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. పిటిషనర్లుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని కూడా ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల న్యాయవాదులు

(మిగతా 2వ పేజీలో)



## సిఎంకు జూపల్లి ఫిర్యాదు..రిజ్వీ విఆర్ఎస్



## పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లు

# రవాణా చెక్‌పోస్టులు రద్దు

అడ్డంకులు లేకుండా చూడాలని, రికార్డులు, ఫర్నీచర్, పరికరాలు వెంటనే జిల్లా ట్రాన్స్‌ఫోర్ట్ కార్యాలయానికి తరలించాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్థిక, పరిపాలనా రికార్డులను సమన్వయం చేసి భద్రపరచాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన ప్రకటనలు ఇవ్వాలని, చెక్ పోస్టుల మూసివేతపై సమగ్ర నివేదికను అక్టోబర్ 22 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని రవాణాశాఖ కమిషనర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.' కాగా, గత శనివారం అర్ధరాత్రి (18వ తేదీన) రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీఏ చెక్ పోస్టులపై ఏసిబి అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. సంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఉమ్మడి ఆదిలాబాద్, కామారెడ్డి, కొమరం భీం జిల్లాల్లోని చెక్ పోస్టులపై ఏసిబి అధికారులు దాడులు నిర్వహించడంతో పాటు అక్కడ జరుగుతున్న అవినీతిపై ప్రభుత్వానికి ఏసిబి నివేదిక అందించింది. ఈ నేపథ్యంలోనే బుధవారం రాష్ట్రవ్యాప్తంగా చెక్‌పోస్టులను మూసివేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ చెక్‌పోస్టుల ఎత్తివేత అనంతరం ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ (ఏఎన్‌పిఆర్) అడ్వాన్స్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురానుంది. ఈ అడ్వాన్స్డ్ కెమెరా సిస్టమ్ ఖైరతాబాద్‌లోని ప్రధాన రవాణా శాఖ ఆఫీస్‌కు అనుసంధానమై ఉంటుంది. దీంతో రవాణా శాఖలో పారదర్శకత స్పష్టంగా కనిపించనుంది. అయితే, ప్రస్తుతం చెక్‌పోస్టుల వద్ద డ్యూటీ చేస్తున్న సిబ్బందికి కొత్త బాధ్యతలు అప్పగించనున్నారు. ఏ వాహనం అయినా కెమెరా కళ్లు గప్పి ఇతర మార్గాల ద్వారా రాష్ట్రంలోకి వస్తే వాటిని జాతీయ రహదారులపై అడ్డుకొని చర్యలు తీసుకునేందుకు వీలుగా మొబైల్ స్క్వాడ్‌లను కూడా రవాణా శాఖ రంగంలోకి దింపనుంది. ఈ వ్యవస్థపై ముందుగా గూడ్స్ ట్రాన్స్‌ఫోర్ట్ చేసే వాహన యజమానుల అసోసియేషన్‌కు ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించనున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్యాసింజర్ వెహికల్స్‌తో పాటు సరకు రవాణా వాహనాల పర్మిట్లు, మిగిలిన అనుమతులన్నీ




ముందే ఆన్‌లైన్‌లో పొందేలా రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి అనుమతుల్లేకుండా లేదా నిబంధనలు ఉల్లంఘించి రాష్ట్రంలోకి ప్రవేశిస్తే వెంటనే గుర్తించి చర్యలు తీసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటివరకు 15 చెక్ పోస్టులు దగ్గర విధుల్లో ఉన్న సుమారు 70 మంది ఎంవిఐలు, ఏఎంవిఐలు, ఇతర సిబ్బందిని ప్రస్తుతం రవాణా శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించనున్నారు.

# సిఎంకు జూపల్లి ఫిర్యాదు..రిజ్వీ విఆర్ఎస్

హైదరాబాద్: సీనియర్ ఐఏఎస్ సయ్యద్ అలీ ముర్తజా రిజ్వీ స్వచ్ఛంద పదవీ విరమణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రిజ్వీ 1999 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఆయనకు సుమారుగా 10 ఏళ్ల సర్వీసు ఉన్నా ఆయన పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ఆయన పనితీరుపై ప్రభుత్వం కూడా అసంతృప్తి వ్యక్తం చేసినట్టుగా తెలిసింది. దీంతోపాటు ఆయన పనితీరుతో పాటు మద్యం కంపెనీల విషయమై సంబంధిత మంత్రి జూపల్లి కృష్ణారావు వర్సెస్ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీల మధ్య వార్ జరిగిందన్న చర్చ ప్రస్తుతం ఎక్సైజ్ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీపై పలు ఆరోపణలు చేస్తూ మంత్రి జూపల్లి సిఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్టుగా తెలిసింది. దీంతోపాటు ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ తీసుకున్న నిర్ణయాలతో ఎక్సైజ్ శాఖకు కోట్లలో నష్టం వచ్చిందని సిఎంకు మంత్రి జూపల్లి ఫిర్యాదు చేసినట్టుగా సమాచారం. మంత్రి జూపల్లి చేసిన ఫిర్యాదులోని కొన్ని అంశాలు ఇలా... మంత్రి జూపల్లి చేసిన ఫిర్యాదులోని కొన్ని అంశాలు ఇలా ఉన్నాయి. మద్యం లేబుళ్లకు సంబంధించి రిజ్వీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, దీంతోపాటు 2బి బార్‌ల విషయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా రిజ్వీ వ్యవహారించారని, బార్ యజమానుల బకాయిల చెల్లింపులోనూ, బార్ లైసెన్సులను రెన్యువల్ వ్యవహారంలోనూ రిజ్వీ ఆరునెలల పాటు ఆలస్యం చేశారని మంత్రి జూపల్లి సిఎంకు ఫిర్యాదు చేసినట్టుగా తెలిసింది. వీటితో పాటు టిజిబిసిఎల్ విషయంలోనూ రిజ్వీపై మంత్రి జూపల్లి అనేక ఫిర్యాదులు చేసినట్టుగా తెలిసింది. రిజ్వీపై వచ్చిన ఆరోపణలపై మంత్రి జూపల్లి సంజాయిషీ కోరినా ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ పట్టించుకోలేదని మంత్రి జూపల్లి సిఎంకు ఫిర్యాదు చేసినట్టుగా తెలిసింది.

**టిజిబిసిఎల్‌లో అనేక అవకతవకలు?**

టిజిబిసిఎల్‌లో అనేక అవకతవకలు జరిగాయని, వాటికి సంబంధించి రికార్డులను సమర్పించాలని మంత్రి జూపల్లి ఆదేశించినా అటు ప్రభుత్వానికి, ఇటు మంత్రికి ప్రిన్సిపల్



సెక్రటరీ రిజ్వీ సమర్పించలేదని మంత్రి జూపల్లి సిఎంకు ఫిర్యాదు చేసినట్టుగా సమాచారం. ఇక, మద్యం ధరల విషయంలోనూ ప్రిన్సిపల్ సెక్రటరీ రిజ్వీ ప్రభుత్వ ఆదాయానికి నష్టం వచ్చేటట్టు వ్యవహారించారని ఇదే విషయమై గతంలోనూ ప్రభుత్వం ఆయన్ను వివరణ కోరగా ఆ విషయంలోనూ ఆయన స్పందించలేదని తెలిసింది. ప్రస్తుతం సిఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు వెళ్లిన నేపథ్యంలో రిజ్వీ మనస్థాపంతో విఆర్ఎస్ తీసుకున్నట్టుగా సెక్రటేరియట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# పట్టణాల్లో ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ : పట్టణాల్లోని పేదలకు జి ప్లస్ 1 తరహాలో ఇందిరమ్మ ఇండ్లు క ట్టుకునే అవకాశం కల్పించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ గృహ ని ర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పై బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో మం త్రి హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో ఇరుకు స్థలాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు పక్కా ఇంటి వసతిని కల్పించేలా ఇందిరమ్మ పథకాన్ని వర్తింప చేస్తున్నామన్నారు. కనీసం 30 చదరపు మీట ర్ల విస్తీర్ణంలో జి ప్లస్ 1 తరహాలో ఇంటిని ని ర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. గ్రౌండ్ ఫ్లోర్లో 200 చదరపు అడుగులు మొదటి అంతస్తులో మరో 200 చదరపు అడుగులు నిర్మించుకునేలా ఈ మేరకు జీఓ ఎంస్ నెం 69 ద్వారా ఉత్తర్వులు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు. పట్టణ ప్రాం తాల్లో పేదలకు పక్కా ఇంటి వసతిని కల్పించాలన్న లక్ష్యంతో పాటు, స్థలాల కొరత ను దృష్టి లో ఉంచుకుని కొన్ని సడలింపులు ఇచ్చామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక పట్టణాలు, నగరాల్లోని పేదలు సొంత ఇంటిని నిర్మించుకోడానికి తగిన స్థలం లేక , అరకొర వసతులతో తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుంటూ జీవ నం సాగిస్తున్నారని, వారి కోసం ఇం దిరమ్మ ఇండ్ల ను నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. పట్టణాల్లో 60 చ దరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలోని రేకు ల షెడ్లు, ఇతరత్రా తాత్కాలిక ఏర్పాట్లుతో జీవిస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి వారికి ఆర్ సిసి స్లాబుతో పక్కా ఇంటిని నిర్మించాలంటే తగిన స్థలం అందుబాటులో లేదని, ఈ సమస్యను అధిగమించడానికి పట్టణ ప్రాం తాల్లో జి ప్లస్ 1 నిర్మాణాలకు అనుమతిస్తూ,



ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుకు ప్రభు త్వం నిర్ణయం తీసుకుందన్నారు. జి ప్లస్ 1 విధానంలో పట్టణ ప్రాంతాల్లోని లబ్ధిదారులు 96 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 70 అడుగుల విస్తీర్ణంలో వేర్వేరుగా రెండు గదులతోపాటు, కనీసం 35.5 చదరపు అడుగుల్లో వంటగదిని నిర్మించుకోవాల్సి ఉంటుందన్నారు.

## ఇజ్రాయెల్‌ను మేమే రక్షించుకుంటాం..

# అమెరికాపై ఆధారపడం: నెతన్యాహు

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం(ఇజ్రాయెల్) అమెరికా రక్షిత ప్రాంతం కాదని, ఎలాంటి ముప్పు ఎదురైనా ఇజ్రాయెల్ స్వయంగా ఎదుర్కుంటుందని ఆయన స్పష్టంగా తెలిపారు. ఇజ్రాయెల్ భద్రతను కాపాడేది ఇజ్రాయెల్ మాత్రమే. మేము ఇతర దేశాలపై ఆధారపడలేం అంటూ వ్యాఖ్యలు చేశారు. గాజా కాల్పుల విరమణ ఒప్పందం పురోగతిపై చర్చించేందుకు బుధవారం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో నెతన్యాహు సమావేశమయ్యారు. వాన్స్%-%నెతన్యాహు సమావేశంలో గాజా పరిస్థితి, హమాస్ కార్యకలాపాలు, యుద్ధానంతర పునరావాసం, అంతర్జాతీయ సాయంపై విస్తృతంగా చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలో నెతన్యాహు మాట్లాడారు. గాజాలో అంతర్జాతీయ దళాలను మోహరిస్తే భవిష్యత్తులో ఆ ప్రాంతం నుంచి ఉద్భవించే భద్రతా ముప్పులకు ఇజ్రాయెల్ సమాధానం చెప్పే అవకాశాలు తగ్గిపోతాయని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ భద్రతను కాపాడేది ఇజ్రాయెల్ మాత్రమే. మేము ఇతర దేశాలపై ఆధారపడలేం అని స్పష్టం చేశారు. గాజా యుద్ధం



తరువాత భవిష్యత్తు పరిపాలనపై అంతర్జాతీయ వర్గాలు వివిధ ప్రతిపాదనలు చేస్తుండగా నెతన్యాహు వ్యాఖ్యలు కీలకంగా మారాయి. అంతకుముందు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, నెతన్యాహు కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్ మాట్లాడుతూ.. ఇజ్రాయెల్, అమెరికా ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. హమాస్‌ను నిరాయుధీకరణ చేయడం, ఆ సంస్థ ఇకపై ఇజ్రాయెల్‌కు ముప్పుగా మారకుండా చూసుకోవడం, గాజాను పునర్నిర్మించడం వంటి అంశాలు సులభం కావు. కానీ మేము ఆశావహ దృక్పథంతో ముందుకు వెళ్తున్నాం' అని చెప్పుకొచ్చారు. గాజా సంక్షోభం తగ్గించాలంటే రాజకీయ స్థాయిలో సమగ్ర పరిష్కారం అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. హమాస్ నిరాయుధీకరణతో పాటు పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వకపోతే మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. నెతన్యాహు, వాన్స్ సమావేశం అనంతరం ఇరుదేశాల ప్రతినిధులు విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో..ఇజ్రాయెల్ భద్రతా హక్కును అమెరికా గౌరవిస్తుంది. గాజాలో మానవతా సాయం అందించడంలో ఇరుదేశాలు కలిసి పని చేస్తాయని పేర్కొన్నారు. గాజా యుద్ధం తగ్గుముఖం పట్టినా, రాజకీయ స్థాయిలో ఒప్పందాలు సాఫీగా సాగకపోవడం అంతర్జాతీయ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో నెతన్యాహు చేసిన వ్యాఖ్యలు గాజా భవిష్యత్తుపై కొత్త చర్చలకు దారితీశాయి.

## స్థానికంపై నేడు నిర్ణయం!

మళ్లీ టెండర్లు నిర్వహించి పనులను కొత్త కాంట్రాక్టర్‌కు అప్పగించాల్సి ఉంటుంది. అలా చేస్తే పెరిగిన ధరల ఆధారంగా అంచనాలు కొన్ని రెట్లు పెరిగిపోయే అవకాశం ఉంది. ఆయా అంశాలపై మంత్రివర్గం కూలంకషంగా చర్చించి నిర్ణయం తీసుకోనుంది. దేవాదుల ప్రాజెక్టు ప్యాకేజీ%-%6 అంచనాల పెంపుతో పాటు అదనంగా మూడో దశ పనులకు అనుమతులు ఇచ్చే అంశాన్ని కూడా తేల్చవచ్చని అంటున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల పునరుద్ధరణ పనులకు డిజైన్ల రూపకల్పన కోసం ఇటీవల నీటిపారుదల శాఖ ఆహ్వానించిన ఆసక్తి వ్యక్తీకరణ టెండర్లకు సైతం ఆమోదం తెలిపే (రాటిఫై) అవకాశం ఉన్నట్టు తెలిసింది. అలాగే ఎస్ఆర్ఎస్‌పీ రెండో దశకు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పేరు పెట్టే అంశాన్ని మంత్రివర్గం రాటిఫై చేయనుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబర్ 7తో రెండేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన విజయోత్సవాలపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫారసులకు ఆమోదం తెలపనున్నట్టు తెలిసింది. విజయోత్సవాల్లో భాగంగా సనత్‌నగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రారంభించడంతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం చేపట్టనుంది. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్%-%2047పై మంత్రివర్గం చర్చించి ఆమోదించే అవకాశం ఉంది.

## 'జూబ్లీహిల్స్'పై నేడు కేసీఆర్ దిశానిర్దేశం

అనుసరించాల్సిన ప్రచార వ్యూహంతోపాటు క్షేత్ర స్థాయిలో నెలకొన్న రాజకీయ స్థితిగతులు, ఓటరు మనోగతం తదితరాలపై చర్చించినట్టు సమాచారం. బీఆర్ఎస్ పట్ల ఉన్న సానుకూలతను ఓట్ల రూపంలో మలుచుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహంపై ఈ భేటీలో కసరత్తు జరిగినట్టు తెలిసింది. బహిరంగ సభకు విముఖత: ఇప్పటికే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపుతూ బాకీ కార్డులను పంపిణీ చేస్తూ బీఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. ప్రచారానికి కేవలం 15 రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో విస్తృత ప్రచారానికి అవలంబించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దృష్టి సారించారు. నగరంలో ఉండే ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని భారీ సభలు, సమావేశాల జోలికి వెళ్లకుండా డివిజన్ల వారీగా హాల్ మీటింగ్స్, కార్నర్ సమావేశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. ఓటర్లకు చేరువయ్యేందుకు ఉదయం, సాయంత్రం వేళల్లో పార్టీ బృందాలు ప్రతీ ఇంటిని సందర్శించేలా షెడ్యూల్ రూపొందించాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రచారం చివరిదశలో జరిగే రోడ్ షోలో కేసీఆర్ పాల్గొనే అవకాశమున్నట్టు బీఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి.

## రెండేళ్లలో ఉస్మానియా

వేగవంతానికి వైద్యారోగ్య శాఖ, పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ అధికారులతో వెంటనే సమన్వయ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కమిటీ ప్రతి పది రోజులకోసారి సమావేశమై ఏవైనా సమస్యలుంటే పరిష్కరిస్తూ పనులు వేగంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయ్యాక అక్కడి బందోబస్తు, ట్రాఫిక్ విధుల నిర్వహణకు సంబంధించి ముందుస్తుగానే తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారు. హైదరాబాద్‌తో పాటు వివిధ జిల్లాల్లో నిర్మాణంలో ఉన్న ఆసుపత్రులు, మెడికల్ కళాశాలల నిర్మాణానికి సంబంధించి ప్రతి నిర్మాణం పర్యవేక్షణకు ఒక అధికారిని నియమించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమీక్షలో సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, శ్రీనివాసరాజు, కార్యదర్శి మాణిక్‌రాజ్, డీజీపీ శివధర్‌రెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు వికాస్‌రాజ్, క్రిస్టినా జెడ్ చోంగ్తూ, ఇలంబర్తి, ముషారఫ్ అలీ ఫరూఖీ, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డీఎంఈ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫిరాయింపుల విచారణ తిరిగి షురూ!

క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అయితే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు ఇచ్చిన సమాధానాలపై పిటిషనర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. మౌఖిక, లిఖిత పూర్వక వాదనలు వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని స్పీకర్‌ను కోరారు. ఈ నెల 4 వరకు ఇరుపక్షాల వాదనలు విన్న స్పీకర్ విచారణను ఈ నెల 24కు వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

**మరో నలుగురి విచారణకు షెడ్యూల్?**

పది మంది ఎమ్మెల్యేలు ఆరోపణలు ఎదుర్కొంటుండగా నలుగురికి సంబంధించిన విచారణ షెడ్యూల్‌ను మాత్రమే స్పీకర్ గతంలో ప్రకటించారు. మరో నలుగు రు ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, డాక్టర్ సంజయ్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకటరావుపై బీఆర్ఎస్ ఇచ్చిన పిటిషన్లపై నెలాఖరులోగా స్పీకర్ విచారణ షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉంది. కోర్టు విధించిన అక్టోబర్ 30 గడువులోగా విచారణ పక్రియ ముగిసే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు స్పీకర్ నోటీసు లు అందుకున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, దానం నాగేందర్ ఇప్పటివరకు స్పందించలేదని సమాచారం. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు తమ వివరణ ఇచ్చి ఉంటే సంబంధిత కాపీలు తమకు అంది ఉండేవని బీఆర్ఎస్ శాసనసభాపక్షం వర్గాలు వెల్లడించాయి. సుప్రీంకోర్టు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో విచారణ పూర్తి చేసేందుకు మరికొంత సమయం కోరాలనే యోచనలో స్పీకర్ కార్యాలయం ఉన్నట్లు సమాచారం.



## బీహార్ పాలి'ట్రిక్స్'..
## బీజేపీలోకి 'అనర్హత' ఆర్జేడీ నేత

పాట్నా: అసెంబ్లీ ఎన్నికల వేళ బీహార్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. బీహార్‌లో నేతల జంప్ జిలానీ వ్యవహారాలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా ఆర్జేడీ నేత అనిల్ సహానీ బుధవారం బీజేపీలో చేరారు. విశేషం ఏమిటంటే ఈయనను మూడేళ్ల క్రితం మోసం కేసులో సీబీఐ కోర్టు దోషిగా తేల్చి శిక్ష విధించటంతో అనర్హత వేటు పడి ఎమ్మెల్యే సభ్యత్వాన్ని కోల్పోయారు. 2012లో ఆయన ఆర్జేడీ రాజ్యసభ ఎంపీగా ఉన్నప్పుడు ఫోర్జరీ విమాన టికెట్లు సమర్పించారని సీబీఐ కేసు నమోదు చేసింది. ఆ కేసులో సీబీఐ కోర్టు విచారణ జరుపుతుండగానే 2020లో ఆర్జేడీ తరఫున కుర్హానీ నియోజవర్గంలో పోటీచేసి బీజేపీ నేత కేదార్ గుప్తను ఓడించి ఎమ్మెల్యేగా గెలిచారు. మూడేళ్ల క్రితం కోర్టు అనిల్‌ను దోషిగా తేల్చటంతో అసెంబ్లీ సభ్యత్వం కోల్పోయారు. ఆ తర్వాత వచ్చిన ఉప ఎన్నికల్లో కేదార్ గుప్త గెలిచి, రాష్ట్ర మంత్రి అయ్యారు. బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, బీజేపీ జాతీయ కార్యదర్శి వినోద్ తావ్‌డేల సమక్షంలో అనిత్ సహానీ బీజేపీలో చేరు.

# లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోటెత్తిన రోగులు





నాచారం (వాయిస్ టుడే):వాతావరణంలో వస్తున్న మార్పులతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. జ్వరాలు జలుబు, దగ్గులతో తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకు పేషంట్ల తాకిడి ఎక్కువవుతుంది. సరిపడ వైద్యులు అందుబాటులో లేక పేషెంట్లు గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉండాల్సి వస్తుంది. హాస్పిటల్లో సరైన వసతులు లేక అక్కడికి వచ్చినవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం వీటిని పట్టించుకోవడమే లేదని అంటున్నారు. లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోటెత్తిన రోగులు. వాతావరణం లో వస్తున్న మార్పులతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. జ్వరాలు జలుబు, దగ్గులతో తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకు పేషంట్ల తాకిడి ఎక్కువవుతుంది. సరిపడ వైద్యులు అందుబాటులో లేక పేషెంట్లు గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉండాల్సి వస్తుంది. హాస్పిటల్లో సరైన వసతులు లేక అక్కడికి వచ్చినవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం వీటిని పట్టించుకోవడమే లేదని అంటున్నారు. లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోటెత్తిన రోగులు. వాతావరణం లో వస్తున్న మార్పులతో ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. జ్వరాలు జలుబు, దగ్గులతో తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ సామాజిక ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకు పేషంట్ల తాకిడి ఎక్కువవుతుంది. సరిపడ వైద్యులు అందుబాటులో లేక పేషెంట్లు గంటల తరబడి క్యూ లైన్ లో వేచి ఉండాల్సి వస్తుంది. హాస్పిటల్లో సరైన వసతులు లేక అక్కడికి వచ్చినవారు అనేక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది అని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు కనీసం వీటిని పట్టించుకోవడమే లేదని అంటున్నారు. ఈ విషయమై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య మాట్లాడుతూ లాలాపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు ప్రతిరోజు దాదాపు 150 కి పైగా ఓపి కేసులు వస్తున్నాయన్నారు. బుధవారం గోపి



మొత్తం,154 ఇందులో జనరల్ మెడిసిన్ – 61, ఓ బి జి – 39, పీడియాట్రిక్ – 54 తదితర కేసులు ఉన్నాయి. దీంతోపాటుగా తెలంగాణ డయాగ్నోస్టిక్స్ యు ఎస్ జి – 31,.ఎక్స్–రే – 15, లాబరేటరీ సేవలు– 34 నమోదైనట్లు మెడికల్ ఆఫీసర్ పేర్కొన్నారు.

## పార్టీ పరంగా వద్దే వద్దు చట్టపరంగానే ఇవ్వాలి

### జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య

సికింద్రాబాద్, అక్టోబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి): రేపటి క్యాబినెట్ లో స్థానిక సంస్థలలో 42 శాతం బీసీ రిజర్వేషన్లు పార్టీ పరంగా చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలుస్తోందనీ, రిజర్వేషన్లు పార్టీ పరంగా వద్దే వద్దు, చట్టబద్ధంగా నే ఇవ్వాలని హెచ్చరిస్తూ ముఖ్యమంత్రి కి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ఒక లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం విద్యానగర్లోని బీసీ భవన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మాకు బిక్షం వద్దు, చట్టబద్ధంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసు కోర్టులో ఉండగా తొందర దేనికనీ, రెండు నెలలో తీర్పు రానుందనీ, రెండు నెలలు ఆగలరని ప్రశ్నించారు. మొన్నటి బంద్ చారిత్రాత్మకం అని చెప్పారు. అన్ని పార్టీలు అన్ని వర్గాల మొత్తం మద్దతు ఇచ్చారన్నారు. గతంలో ఎప్పుడూ ఇంత చారిత్రాత్మకంగా బంద్ జరగలేదన్నారు. బంద్ తీవ్రతను చూసి ప్రభుత్వం కళ్ళు కలవాలని కోరుతూ, ముఖ్యమంత్రి కి లేఖ ద్వారా కోరారు. ప్రస్తుతం స్థానిక సంస్థలలో బీసీలకు ఇచ్చిన రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధ, చట్టబద్ధత, న్యాయబద్ధత ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–%ణ%–6 ప్రకారం రిజర్వేషన్లు నిర్ణయించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందన్నారు. అలాగే అసెంబ్లీలో బీసీ బిల్లు చట్టం చేశారన్నారు. జనాభా లెక్కలు తీసి న్యాయ బద్ధం చేశారను, గతంలో సుప్రీంకోర్టు అనేకసార్లు తీర్పులలో జనాభా లెక్కలు ఉంటే దాని ప్రకారం రిజర్వేషన్లు పెంచవచ్చని తీర్పు చెప్పారనీ, అన్ని కోణాలలో పెంపుదలకు మద్దతు ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243–%ణ%6 ప్రకారం స్థానిక సంస్థలోని బీసీ రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగం అధికారం ఇచ్చిందనీ, కావున అసెంబ్లీ చట్టం చేశారనీ, జీవో తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చనీ, ఏమైనా న్యాయపరమైన సమస్యలు వస్తే సుప్రీంకోర్టుకు ఏ కోర్టుకు ఎవరైనా వెళ్లిన బీసీల, కేసులు గెలిచే అవకాశం ఉందన్నారు. ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి అసెంబ్లీ చట్టం చేశారు అలాగే సుప్రీంకోర్టు అగ్ర కులకు 10శాతం రిజర్వేషన్లు పెట్టినప్పుడు కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది అని చెప్పారు. పైగా ఇందిరా సహానీ కేసులో ఎంపరికల్ డాటా ఉంటే 50% సీలింగ్ ను అధిగమించవచ్చునని సుప్రీం కోర్టు అభిప్రాయం కూడా ఉన్నదని అన్నారు. ప్రస్తుతం అన్ని కోణాల్లో చూస్తే కేసు గెలిచే అవకాశం ఉందన్నారు.



## ఘనంగా కొమురం భీమ్ జయంతి వేడుకలు

సికింద్రాబాద్, అక్టోబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణగూడ నగర శాఖ ఆధ్వర్యంలో కొమరం భీమ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్ జిల్లా కన్వీనర్ సాయి తేజ మాట్లాడుతు కొమరం భీమ్ ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహా వీరుడు, బ్రిటిష్ పాలనతో పాటు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గోండుల హక్కులు రక్షించడానికి ఆయన ధైర్యంగా ఎదిరించారన్నారు."జల్,జంగల్, జమీన్ మా హక్కు" అనే నినాదంతో గిరిజనుల ఆస్తి, భూమి, అడవుల మీద హక్కుల కోసం ఆయన ఉద్యమాన్ని ప్రారంభించారనీ తెలిపారు. భీమ్ పోరాటం ప్రజలకు న్యాయం తెచ్చే దిశగా సాగిందనీ, ఆయన ధైర్యం, త్యాగం, నాయకత్వం వల్ల ఆయన పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆకాష్ మరియు కార్యకర్తలు నగేష్, హర్షిత్, నవీన్, ప్రముఖ్, అఖిల, నైనిక, తదితరులు పాల్గొనడం జరిగింది.

# మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే...

**ఎవరైనా రాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు....**

**డ్రగ్స్ వాడవద్దు...**

**ఈస్ట్ జోన్ డిసిపి బాలస్వామి....**

**గాంధీ మెడికల్ కాలేజ్ విద్యార్థులకు ఈస్ట్ జోన్ డిసిపి పలు సూచనలు....**



సికింద్రాబాద్, అక్టోబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి): మీరు కష్టపడి సంపాదించిన సీటు ఎంతో విలువైనది, మీ భవిష్యత్తు ఇప్పుడు మీ చేతుల్లోనే ఉంది అనీ గాంధీ మెడికల్ కాలేజ్ మొదటి సంవత్సరం విద్యార్థుల ను ఉద్దేశించి ఈస్ట్ జోన్ డీసీపీ బి. బాలస్వామి పలు సూచనలు చేశారు. ఈ మేరకు బుధవారం గాంధీ మెడికల్ కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఈస్ట్ జోన్ డిసిపి బి బాలస్వామి ఐపీఎస్ పాల్గొని మాట్లాడారు. కష్టపడి చదివి ప్రజలకు వైద్య సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. డాక్టర్ వృత్తిలో పేషెంట్ల ను సానుభూతితో చూసి, వారికి సేవ చేయడం మీ ప్రధాన బాధ్యత అని తెలిపారు. సీనియర్స్ తో పరిచయాలు కలిగి, కొత్త అనుభవాలు పంచుకోవడం మంచిదనీ, కానీ ఎవరైనా ర్యాగింగ్ చేసినా, ఇబ్బంది కలిగించినా, మానసికంగా, శారీరకంగా ఎవరైనా ఇబ్బంది కలిగించినా వెంటనే అడ్మినిస్ట్రేషన్ ను గాని, యాంటీ ర్యాగింగ్ కమిటీ, ప్రిన్సిపల్ కు గాని, మీ ప్రొఫెసర్ లకు గానీ, పోలీస్ శాఖను గాని సంప్రదించాలనీ సూచించారు. ర్యాగింగ్ కు పాల్పడినవారి పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, వారిని కాలేజీ నుండి డిస్మిస్ చేసి, ఇతర విద్యాసంస్థల్లో అడ్మిషన్ అవకాశాలు లేకుండా చర్యలు తీసుకోబడతాయన్నారు. తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ యాక్ట్ 1997 సెక్షన్ 3 ప్రకారం ర్యాగింగ్‌ను ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ లోపల గాని, బయట గాని పూర్తిగా నిషేధించారనీ చెప్పారు. డ్రగ్స్ వాడవద్దని, డ్రగ్స్ వాడిన, కలిగి ఉన్నా, ఇతరులకు సప్లై చేసినా వారి పైన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. డ్రగ్స్ అలవాటు మీ భవిష్యత్తును నాశనం చేస్తుందని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ సూసైడ్ వంటి తీవ్ర చర్యలు చేయరాదనీ సూచించారు. అత్యవసర సమయంలో మెడికల్ టోల్ ఫ్రీ నంబర్ లేదా 100కు కాల్ చేయవచ్చన్నారు. సోషల్ మీడియా వాడేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, మీ వ్యక్తిగత వివరాలు తెలియని వ్యక్తులతో పంచుకోవద్దనీ ఉపోద్ఘటించారు. సోషల్ మీడియాలో ఎవరైనా బెదిరించినా, బ్లాక్ మెయిల్ చేసినా లేదా డబ్బు డిమాండ్ చేసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఇందిర, గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఆర్ఎంఓ–1 డాక్టర్ శేషాద్రి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజారావు, చిలకలగూడ ఏసీపీ కె.శశాంక్ రెడ్డి, ఇన్స్పెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వాముల అన్నదాన సమారాధన కార్యక్రమము

### పాల్గొన్న జనసేన నాయకులు ప్రేమ్ కుమార్

కూకట్‌పల్లి, అక్టోబర్ 22(వాయిస్ టుడే): కూకట్ పల్లి నియోజకవర్గం హౌసింగ్ బోర్డు కాలనీలో 2వ రోడ్ లో గల శ్రీశ్రీశ్రీ షిర్డి సాయిబాబా దేవాలయం వారి ఆధ్వర్యంలో శ్రీ సాయి మణికంఠ భక్త సమాజం వారు నిర్వహించిన మొదటి రోజు అయ్యప్ప స్వాముల అన్న సమారాధన కార్యక్రమానికి నిర్వాహకులు ఎల్. రాజ, ఎల్. నాగేశ్వరరావు ఆహ్వానం మెరకు కూకట్ పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ అయ్యప్పస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ "అన్నదానం అన్నది అత్యున్నతమైన దానం. భక్తి, సేవ, సమర్పణ ౨ ఈ మూడు మనిషిని దైవత్వం వైపు నడిపిస్తాయి. అయ్యప్ప స్వామి కృపతో అందరికీ శాంతి, సౌఖ్యం కలగాలని కోరుకుంటున్నానని తెలిపి స్వాములతో కలిసి అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం నిర్వాహకులు ప్రేమకుమార్ ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కొల్లా శంకర్, కలిగినీడి ప్రసాద్, దాసరి వెంకట్, పోలేబోయిన శ్రీనివాస్, వెంకట్ , మండల రమేష్, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు బి ఆర్ ఎస్ వైపే ఉన్నారు

జూబ్లీహిల్స్ 22 అక్టోబర్ (వాయిస్ టుడే): ఎర్రగడ్డ డివిజన్ ప్రేమ్ నగర్ లో ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహించిన టిఆర్ఎస్ శ్రేణులు.. జూబ్లీహిల్స్ టిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీతను ఓటు వేసి గెలిపించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో భూపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే నారాయణ ఖేడ్. ఫాతేనగర్ మాజీ కార్పొరేటర్ సతీష్ గౌడ్.. ఎర్రగడ్డ కంటెస్టెడ్ కార్పొరేటర్ పల్లవి మహేందర్ యాదవ్.. ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షుడు డి సంజీవ... సుదర్శన్ రెడ్డి.. లాటీఫ్.. షేకర్.. రహీమా.. శారదా.. సురేందర్ నాయుడు ఇతరులు పాల్గున్నారు.



## ఇంటింటి వెళ్లి కాంగ్రెస్ పార్టీను ఓటు వేయండి తెలిపిన హబీబ సుల్తానా..

జూబ్లీహిల్స్, 22 అక్టోబర్ (వాయిస్ టుడే): బోరబండ డివిజన్ రాజ్ నగర్ లో మాజీ డిప్యూటీ మేయర్ (GHMC), బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దిన్ గారి సతీమణి శ్రీమతి హబీబా సుల్తానా గడప గడపకు ప్రచారం నిర్వహించారు. ప్రచారం లో భాగంగా హబీబా సుల్తానా గారు ప్రతీ ఇంటికి వెళ్లి ఆడపడుచులను ఆత్మీయంగా పలకరిస్తూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న,చేయబోతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తు ప్రతి ఒక్కరితో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గారికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రచారం చేశారు...ఈ కార్యక్రమం లో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు,ప్రజలు పాల్గొన్నారు.



## బోరబండలో గడపగడప వెళ్లి ప్రచారం నిర్వహించిన జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్



జూబ్లీహిల్స్, 22 అక్టోబర్ (వాయిస్ టుడే): బోరబండ డివిజన్లో పర్యటించిన కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ వారితోపాటు మంత్రి సీతక్క ఇరిగేషన్ డిపార్ట్మెంట్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు మరియు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియోద్దీన్ గడపగడప వెళ్లి ప్రచారం నిర్వహించారు.. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు గుర్తించి చేతు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలతో కోరారు.

## ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్




జూబ్లీహిల్స్, 22 అక్టోబర్ (వాయిస్ టుడే): వెంగల్ రావు నగర్ డివిజన్ 203,204,205 బూత్ లలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మెన్ జంగా రాఘవ రెడ్డి మరియు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్..ప్రజల సమస్యలను తెలుసుకుంటూ..ప్రజలఆశలు..ఆకాంక్షలను నెరవేర్చగల శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీ కే ఉందని..రేవంత్ రెడ్డి గ చేస్తున్న అభివృద్ధి పనులను గుర్తించి చేతి గుర్తు కు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్.. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ప్రజల కొరకు కాంగ్రెస్ పార్టీ ఉందని తెలిపారు. ఛైర్మెన్ జంగా రాఘవ రెడ్డి మరియు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్రజల సమస్యలను తెలుసుకుంటూ.. ప్రజలఆశలు..ఆకాంక్షలను నెరవేర్చగల శక్తి ఒక్క కాంగ్రెస్ పార్టీ కే ఉందని..తెలిప్యారు ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేద కుటుంబంలో వైద్య కాంతులు

### ఉచిత వైద్య విద్యలో సీటు సాధించిన యువతి

### హర్షం వ్యక్తం చేసిన బిజెపి కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్, పలువురు గ్రామస్తులు

చిగురుమామిడి, అక్టోబర్ 22 (వాయిస్ టుడే): డాక్టర్ కావాలనే లక్ష్యాన్ని సాధించుకుంది. ఎంబీబీఎస్ సీటు సాధించి శభాష్ అనిపించుకుంటుంది చిగురుమామిడికి చెందిన యువతి. వివరాల్లోకి వెళితే... చిగురుమామిడి గ్రామ వాస్తవ్యులు జెట్టి రాజేశం – స్వరూప దంపతుల కుమార్తె జెట్టి అనూష తన కృషి, పట్టుదల, క్రమశిక్షణతో చదివి 4212 స్టేట్ ర్యాంక్ తో సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఫ్రీ ఎంబీబీఎస్ (%వీదీదీూ%) సీటు సాధించి శభాష్ అనిపించుకుంటుంది. ఈ విశిష్ట విజయాన్ని సాధించిన అనూషకు వారి తల్లిదండ్రులకు బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేస్తూ, హర్షం వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ, గ్రామ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిన జెట్టి అనూషను భారతీయ జనతా పార్టీ కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధి పొన్నం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం అనేది దేనికి అడ్డు కాదని ఏదైనా సాధించాలి అని ధృడ సంకల్పం ఉంటే చాలు మన కలలను సాకారం చేసుకోవడానికి మన నమ్మకమే నిజమైన బలం అంటూ, ఈ పరిణామం అభినందనీయమని పేర్కొంటూ ఒక సామాన్య పేద కుటుంబం నుండి వైద్య విద్యను అభ్యసించి, భవిష్యత్తులో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించి అందరి మన్ననలను పొందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చెరుకు (దుబాయి) రాజయ్య, బొల్లి పరశురాములు మరియు చిగురుమామిడి గ్రామ అధ్యక్షులు దొంత కరుణాకర్, ముదిగిరి రాజు, బొల్లి సాయికుమార్, బండారుపల్లి రాయమల్లు, మల్లం సతీష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## ప్రకృతిని నిరంతరం ప్రశ్నించడమే సైన్స్

### కెమిస్ట్రీ ఆచార్యులు,లయన్ డాక్టర్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి

కరీంనగర్,అక్టోబర్ 22(వాయిస్ టుడే): ప్రకృతిలో జరుగుతున్నది ప్రక్రియలను ప్రశ్నించడం వల్ల సైన్స్ ప్రక్రియలు బయట పడతాయని విశ్రాంత కెమిస్ట్రీ ప్రొఫెసర్–ప్రిన్సిపాల్ లయన్,కెప్టెన్, డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు.జాతీయ రసాయన శాస్త్ర వారోత్సవాల్లో భాగంగా సాయి మానేరు హైస్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథి హాజరై మాట్లాడుతూ మన చుట్టు సహజంగా జరుగుతున్న పలు భౌతిక,రసాయనిక, జీవ శాస్త్ర ప్రక్రియలు ఎలా,ఎందుకు జరుగుతున్నాయని ప్రశ్నిస్తే ఆసక్తికరమైన సైన్సు విషయాలు బయట పడతాయని అన్నారు.ఆకులు పచ్చగా,రక్తం ఎరుపుగా ఉండడానికి కారణమైన పదార్థాల లోతులను అధ్యయనం చేయాలని అన్నారు.మన నిత్య జీవితంలో జరిగే పలు రసాయన ప్రక్రియలను శాస్త్రవేత్తలు పరంగా అధ్యయనం చేయాలని అన్నారు. నిన్నటి కన్న నేడు,నేటి కన్న రేపు ఉత్తమ ఫలికాలను సాధించాలని సూచించారు.నాటి పాతరాతి యుగం నుంచి నేటి డిజిటల్ యుగం వరకు మానవ జీవితాల్లో సమూల మార్పులు వచ్చాయని,చదువుకునే విద్యార్థులు టివీ,మొబైల్ వ్యసనాలకు దూరం ఉంటూ,చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలను సాధిస్తూ ఉన్నత స్థాసిరి ఎదగాలని తెలిపారు.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన లయన్ కడారు అనంత్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ,ఏకాగ్రతలతో చదివిన వారికి ఆశించిన ఫలితాలను సాధించాలని తెలిపారు.వైజ్ఞానిక శాస్త్రం,సాంకేతిక శాస్త్రం కొత్తపుంతలు తొక్కుతున్న ఆధునిక కాలంలో చదువుతో పాటు సంస్కారం,విద్యతో పాటు వినయం అలవర్చుకోవాలని అన్నారు.ఈ సందర్భంగానిర్వహించిన ప్రత్యేక కెమిస్ట్రీ పరీక్షలో విజయం సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం మానేరు విద్యా సంస్థ పక్షాన డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు.



## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

### రైతులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సూచన

తిమ్మాపూర్,అక్టోబర్ 22(వాయిస్ టుడే):దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్మాలని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కపంపల్లి సత్యనారాయణ అన్నారు.బెజ్జంకి మండలంలోని తోటపల్లి,ముత్తన్నపేట, కల్లేపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. తేమ,తరుగు పేరుతో కోతలు ఉండవన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో తేమ,తరుగు పేలిట భారీగా కోతలు విధించి రైతులకు నష్టం చేకూర్చారన్నారు.అలాంటి పరిస్థితి కాంగ్రెస్ పాలనలో లేదన్నారు. వరి ధాన్యం కొనుగోలు చేసిన నిర్ణీత గడువులోగా రైతు ఖాతాల్లో చెల్లింపులు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు.వరి ధాన్యానికి మద్దతు ధర పెంచడమే కాకుండా సన్న వడ్లు పండించే రైతులకు అదనంగా రూ. 500 బోనస్ ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు అక్కరవేణి పోచయ్య ముదిరాజ్, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, సాదిక్ పాల్గొన్నారు.





## దోపిడి,పీడన లేని సమాజం కోసం పోరాడుదాం...

### తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కోకన్వీనర్ కన్నెగంటి రవి...

సికింద్రాబాద్, అక్టోబర్ 22 (వాయిస్ టుడే ప్రతినిధి): దోపిడి, పీడన లేని సమాజం కోసం పోరాడాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కోకన్వీనర్ కన్నెగంటి రవి సూచించారు. ఈ మేరకు గురువారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గంలోని లాలపేట్ లో కొమురెల్లి బాబు అధ్యక్షతన సిపిఐ నూరు వసంతాల సందర్భంగా "సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు పరిష్కార మార్గాలు "అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కన్నెగంటి రవి హాజరై మాట్లాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సృష్టించిన అనేక సమస్యలలో నిరుద్యోగం, పేదరికం, పర్యావరణ విధ్వంసం. కార్మిక వర్గాన్ని దోపిడీ చేయడం, రైతుల ఆత్మహత్యలు, యువతను గంజాయి మత్తు పదార్థాలకు బానిసలుగా చేయటం, మానవ సంబంధాలలో వచ్చిన పెను మార్పులు జరిగాయన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వము కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలను కాపాడటం కోసం మాత్రమే వనరులను వారికి కట్టబెడుతూ పర్యావరణ విధ్వంసానికి పాల్పడుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో వైఫల్యం చెందిన పాలకులు యువతను మత రాజకీయాల వైపు దారి మళ్లిస్తూ తమ అధికార పీఠాన్ని కాపాడుకుంటున్నారనీ చెప్పారు. సమస్యలను పరిష్కరించలేని పాలకవర్గం డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలను యదేచ్ఛగా వినియోగించేలా చూస్తున్నారనీ, సమాజంలో మత్తుకు బానిస అయిన యువత స్వంత కుటుంబ సభ్యుల పైనే దాడులకు తెగబడుతున్నారనీ చెప్పుకొచ్చారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ.. బ్రిటిష్ సామ్రాజ్యవాదం నుంచి మొదలుకొని నేడు కొనసాగుతున్న పాలకవర్గాని కి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించి ప్రజలకు హక్కులను సాధించటం జరిగిందన్నారు. ఈ పోరాటంలో అనేకమంది మెరికలు లాంటి యువకిశోరాలు తమ జీవితాలను త్యాగాలు చేయడం జరిగిందనీ అన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలకు పాదం పెడుతుందని తెలిపారు. విద్యార్థి ,యువజన, కార్మిక, మహిళ, సబ్బండ వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం సంఘాలను నిర్మించి సమాజ మార్పులో భాగం చేస్తామన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను స్కూళ్ల లో చేర్పించి వారికి ఉచిత నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే సమాజంలో మార్పు వస్తుందనీ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మాట్లాడుతూ సాంస్కృతిక ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సికింద్రాబాద్ నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, అడ్డగుట్ట కార్యదర్శి యాదగిరి, గౌరీ నాగరాజు, తార్నాక కార్యదర్శి సయ్యద్ గౌస్,మహిళా హక్కుల నాయకులు శోభ,సువర్ణ. రాములు, యాకయ్య, రమేష్, సింగరయ్య, లెనిన్, దస్తగిరి, యాదగిరి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నాయుడు భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

### సోదరుడు భార్గవ్ ను ఆదుకోవాలి

### కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్



విజయవాడ: నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గం దార కాని పాడు గ్రామంలో తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు హత్యపై ప్రభుత్వంతో సత్వర విచారణ చేపించి , బాధిత కుటుంబానికి పరిహారం అందెలా చేసిన రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందు జనార్ధన్ కు కాపు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. చందు జనార్ధన్ మాట్లాడుతూ ఈనెల రెండవ తేదీన తిరుమల శెట్టి లక్ష్మీనాయుడు కుటుంబంపై హత్యాకాండ జరిగింది. తిరుమల శెట్టి లక్ష్మీ నాయుడు మృతి చెందాడు. ఆయన ఇద్దరు సోదరులు ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో ఉన్నారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్ర కాపు జేఏసీగా ప్రకాశం జిల్లా జేఏసీ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించామని అన్నారు.

వాస్తవాలను తెలుసుకొని లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరాం. జేఏసీ పక్షాన 5 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాం . జేఏసీ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జరిగిన ఘటనపై నలుగురు సభ్యులతో విచారణకు ఆదేశించింది. మూడు రోజుల్లో నివేదిక అందుకుని లక్ష్మీ నాయుడు హత్య ఘటనపై ప్రభుత్వ స్పందించింది. ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పింది. బాధిత కుటుంబ సభ్యులకు నగదు పరంగాను, ఉపాధి నిమిత్తం భూమి పరంగాను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రకటన చేసింది. 10 లక్షల రూపాయల నగదు పరిహారం చెక్కులను కూడా అందించడం కూడా జరిగింది. ప్రభుత్వ స్పందనను కాపు జేఏసీ పక్షాన స్వాగతిస్తున్నాం . అయితే లక్ష్మీ నాయుడు సోదరుడైన నవీన్ ను ఆదుకున్న తరహాలోనే మరో సోదరుడు భార్గవ్ ను సైతం ప్రభుత్వం ఆదుకోవాలని కాపు జేఏసీగా డిమాండ్ చేస్తున్నాం. లక్ష్మీ నాయుడు భార్య కు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. ఆమెకు, ఆమె కుటుంబానికి ప్రాణ రక్షణ భరోసా ప్రభుత్వపరంగా కల్పించాలి. హత్యాకాండ కు పాల్పడిన వారిపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయించి కఠినంగా శిక్షించాలి. ఈ హత్య ఘటనకు సంబంధించి ప్రభుత్వ విచారణలో వెల్లడైన ప్రతి విషయాన్ని ప్రభుత్వం బహిరంగపరచాలి. దారుణంగా హత్యకు గురైన లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కాపు జేఏసీగా కోరాం. ఇది కుల రాజకీయం కాదు. లక్ష్మీ నాయుడు కుటుంబాన్ని ఆదుకునే క్రమంలో స్పందించిన రాష్ట్రా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఓ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, అనిత, నారాయణలకు కాపు జేఏసీ పక్షాన ధన్యవాదాలని అన్నారు.

## అభ్యర్థులు ఖర్చుచేసే ప్రతీ పైసా లెక్కించాలి

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అభ్యర్థులు ప్రచారం కోసం ఖర్చు చేసే ప్రతీ పైసా లెక్కించి వారి ఖాతాలో నమోదు చేయాలని వ్యయ పరిశీలకులు సంజీవ్‌కుమార్‌లాల్ అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంసీఎంసీ, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ రూమ్, ఎంసీసీ కంట్రోల్ రూమ్, ఫిర్యాదుల కేంద్రం, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌ను బుధవారం తనిఖీ చేశారు. ఎంసీసీ నోడల్ అధికారి నరసింహారెడ్డి కేంద్రాల పనితీరును వివరించారు.



## ఓయూలో పీహెచ్.డి ప్రవేశం పొందిన పొగాకు అరవింద్ కుమార్‌కు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్- డి.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ఘన సన్మానం

సికింద్రాబాద్ (వాయిస్ టుడే): ఉస్మానియా విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్.డి ప్రవేశం సాధించిన ఎలిమినేడు గ్రామానికి చెందిన ప్రతిభావంతుడు డి.బి.ఎస్.ఏ విద్యార్థి నాయకుడు పొగాకు అరవింద్ కుమార్‌కు దలిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్– డి.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ఓయూ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ఘన సన్మానం నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమాన్ని డీ.బీ.ఎస్.ఏ రాష్ట్ర కోఆర్డినేటర్, పీహెచ్.డి రీసెర్చ్ స్కాలర్ జంగిలి దర్శన్ సమన్వయం చేస్తూ, గ్రామీణ ప్రాంతాలనుంచి విద్యా శిఖరాలకు చేరుకోవడం అరుదైన సాధన అని, అరవింద్ కుమార్ విజయంతో పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు గొప్ప ప్రేరణ లభించిందని, డీ.బీ.ఎస్.ఏ తరఫున ఆయన భవిష్యత్తు మరింత వెలుగొందాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ సోశాలజీ డిపార్ట్మెంట్ డా. తిరుపతి , ప్రముఖ ఆర్థికవేత్త ఓయూ రీసెర్చ్ స్కాలర్ ప్రభాకర్ చౌటి , మహాజనగళం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ మహాజన, స్వేరో స్టూడెంట్ యూనియన్ నాయకుడు రాజేష్, గిరిజన నాయకుడు సురేష్, డీ.బి.ఎస్.ఏ నాయకులు రాజు, ప్రశాంత్ తదితరులు పొగాకు అరవింద్ కుమార్ సాధించిన ఈ విజయం గ్రామీణ విద్యార్థులకు కొత్త దిశ చూపే ప్రేరణాత్మక ఘట్టమని, తల్లిదండ్రుల కష్టం, పట్టుదల, క్రమశిక్షణ, చదువు పట్ల ఉన్న అభిరుచి కలిసి ఇంతటి విజయానికి దారితీశాయని, సాధనతోనే సార్థకతను చేరుకోవచ్చని ఆయన నిరూపించాడని, భవిష్యత్తులో సివిల్ మరియు స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ రంగంలో విలువైన పరిశోధనలు చేసి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని, యువతకు ఆదర్శంగా నిలవాలని శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం పొగాకు అరవింద్ కుమార్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీహెచ్.డి ప్రవేశం పొందడం తన జీవితంలో ఒక గొప్ప మైలురాయిగా భావిస్తూ, చిన్నప్పటి నుంచీ ఎన్నో సవాళ్లు ఎదురైనా పట్టుదల, క్రమశిక్షణ, ఓపికతో ముందుకు సాగిన ఫలితమే ఈ విజయం అని, చదువు ద్వారానే మన జీవితాన్ని, మన సమాజాన్ని మార్చగలమనే నమ్మకంతోనే ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపాడు.తన చదువులో సహకరించిన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు,గురువులకు,డీ.బీ.ఎస్.ఏ సంఘానికి ,నా శ్రేయోభిలాషులకు,ప్రతి ఒక్కరికి పేరు పేరున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.బి.ఎస్.ఏ స్టేట్ కో ఆర్డినేటర్ జంగిలి దర్శన్, డా. తిరుపతి, ప్రముఖ ఆర్థికవేత్త ఓయూ రీసర్చ్ స్కాలర్ ప్రభాకర్ చౌటి, మహాజన గళం వ్యవస్థాపక అధ్యక్షుడు సురేష్ మహాజన,స్వేరో స్టూడెంట్ యూనియన్ రాజేష్,డి.బి.ఎస్.ఏ నాయకులు రాజు మహేష్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# బేతిగల్ టు కరీంనగర్ నూతన బస్ సర్వీసును ప్రారంభించిన ప్రణవ్

- 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న కల నెరవేరిన వేళ గ్రామస్తుల్లో ఆనందం
- గ్రామాల అనుసంధానికి కాంగ్రెస్ పార్టీ మరింత కృషి
- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
- ఘన స్వాగతం పలికిన బేతిగల్ గ్రామస్థులు





వీణవంక అక్టోబర్ 22 (వాయిస్ టుడే): నూతన బస్సు సౌకర్యం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు,ముఖ్యంగా స్కూల్స్,కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. బుధవారం నాడు హుజురాబాద్ డిపో పరిధిలో జమ్మికుంట నుండి వయా బేతిగల్,కేశవపట్నం మీదుగా కరీంనగర్ వరకు నూతన బస్ సర్వీసును గ్రామస్థులతో కలిసి ఆయన ప్రారంభించారు. దాదాపు 30 ఏళ్లుగా ఎదురుచూస్తున్న బస్ సర్వీసు ప్రణవ్ ప్రారంభించడానికి రావడంతో గ్రామస్థులు బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ బస్ కోసం బేతిగల్ గ్రామ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న కళ ఈ రోజు నిజమయ్యిందని,ప్రతీ రోజు రెండుసార్లు సర్వీసు నడుస్తుందని దీన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం స్వయంగా బస్ టికెట్ తీసుకొని కొంతదూరం ప్రయాణించారు.జమ్మికుంట నుండి కరీంనగర్ వయా బెతిగల్ మీదుగా వెళ్ళే ఈ కొత్త బస్సు వారి ప్రయాణ సమయాన్ని తగ్గించి,భద్రతను పెంచుతుందని,మహిళలకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందనీ,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు.ఏళ్లుగా ఈ రూట్ లో బస్ సౌకర్యం కల్పించాలని ఎదురుచూస్తున్న ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించడం ఆనందంగా ఉందని దీనికి సహకరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామనీ అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఇచ్చిన హామీనీ ఒక్కక్కటి పూర్తి చేస్తామని తెలిపారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..**

వీణవంక మండల పరిధిలోని బేతీగల్,వల్భాపూర్ గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్..బేతిగల్ గ్రామంలో 4,వల్భాపూర్ గ్రామంలో 3 చెక్కులను 3,15,000/- రూపాయల విలువ చేసే చెక్కులను పంపిణీ చేసిన అనంతరం వెంటనే చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు.



## సుందరగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైభవంగా ఆకాశ దీపోత్సవం

చిగురుమామిడి, అక్టోబర్ 22 (వాయిస్ టుడే): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆకాశ దీపోత్సవ వేడుకలు బుధవారం అర్చకుల ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ చొల్లేటి శంకరయ్య సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకాశ దీపోత్సవానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “ఆకాశదీపం వెలిగించడం ద్వారా మనలోని అజ్ఞాన చీకట్లు తొలగిపోతాయన్నారు. ఈ దీపాన్ని దర్శించి నమస్కరించడం ద్వారా పుణ్యప్రాప్తి కలుగుతుందని, పితృదేవతలు సంతుష్టులవుతారని పేర్కొన్నారు. ఆకాశ దీపం యొక్క విశిష్టతను తెలియజేస్తూ “ఆకాశదీపం శివకేశవ తేజస్సును జగత్తుకు ప్రసరింపజేస్తుందని, ఈ మాసం ప్రారంభమైన వెంటనే దేవాలయ ధ్వజస్తంభాలకు దీపం వేలాడదీసే సంప్రదాయం ఉందని, ఇది పితృదేవతలకు మార్గదర్శకం అని తెలిపారు.అర్చకులు శేషం శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ కార్తీక మాసంలో దీపదానం, సాలగ్రామ దానం చేస్తే శ్రీమహావిష్ణు, అష్టలక్ష్మి అనుగ్రహం లభిస్తుంది. ‘దామోదర మావాహయామి’ అంటూ దీపం వెలిగించడం ఆధ్యాత్మిక జ్యోతిని ప్రజ్వలింపజేస్తుందని అన్నారు.

ఆలయ పరిసరాలు భక్తుల నినాదాలతో మార్మోగగా, దీపాల వెలుగులో దేవాలయం అందంగా మెరిసింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పూల లచ్చిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత, జీల సంపత్, ఎలగందుల శారద, శేషం నరసింహాచార్యులు, బొల్లుమల్ల కనకయ్య, బొల్లబత్తిని లక్ష్మి, మాడిశెట్టి స్వరాజ్యలక్ష్మి, చీకోటి సత్యవతి, బొల్లబత్తిని వరలక్ష్మి, బొల్లబత్తి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



## గుండన్న పల్లిలో గాలి కుంటు నివారణ టీకాలు

వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి అక్టోబర్ 22 : బోయినపల్లి మండలం గుండన్నపల్లి గ్రామం లో బుధవారం 3 నెలలు దాటినా సుమారు 160 పశువలన్నీటికి ఉచితంగా గాలి కుంటు నివారణ టీకాలు వేసారు. ఈ కార్యక్రమం లో బోయినిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ సతీష్, విలాసాగర్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీధర్ మరియు JVOలు నరేందర్, మధుమిత, LSAలు రజిత, రమేష్, ఆఫీస్ Sub ఆర్డినేట్, మాజీ సర్పంచ్ రాధా అంజయ్య పాల్గొన్నారు.

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో మొక్కలు నాటిన బైరీ సాయి రెడ్డి



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి అక్టోబర్ 22 : పుట్టినరోజు సందర్భంగా శ్రీ దత్త సాయి ఆలయంలో ఆశీర్వాదం తీసుకొని ఆలయ ఆవరణలో తన స్నేహితులతో కలిసి కొబ్బరి మొక్క నాటిన బైరీ సాయి రెడ్డి.. మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరిత సేనలో భాగంగా బోయినపల్లి మండలం తడగొండ గ్రామంలో శ్రీ దత్తసాయి ఆలయంలో పూజలు నిర్వహించి తదనంతరం ఆలయ ఆవరణలో కొబ్బరి మొక్క నాటిన బైరీ సాయి రెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోజు నా పుట్టిన రోజు సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్ కుమార్ చేపట్టిన గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగంగా నా వంతుగా కొబ్బరి మొక్క నాటడం జరిగింది. భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అలానే వాటిని పరీక్షించాలని కోరుతున్నాను. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న కట్ట జగదీష్ , ఎండి ఆస్లామ్

## పోషకాహారం పక్కగా అందించాలి

**గర్భిణీలు బాలింతలు పిల్లలకు-నాణ్యతతో కూడిన ఆహారం అందించాలి**

**జిల్లా సంక్షేమ అధికారి పి. లక్ష్మీరాజం**



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి అక్టోబర్ 22: మండలంలోని కొదురుపాక సెక్టార్ లోని వెంకటరావుపల్లి అంగన్వాడీ కేంద్రం ఆకస్మికంగా పిడి లక్ష్మీరాజం పరిశీలించారు. ఈ సందర్భంగా పిల్లల యొక్క పూర్వ ప్రాథమిక విద్య స్థాయిలను పరిశీలించారు. అలాగే గర్భిణీలకు బాలింతలకు ఇస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించరు. ఈ సందర్భంగా అంగన్వాడి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఆహార పదార్థాలను సరైన మోతాదులో మంచి నాణ్యతతో కూడినవి వడ్డించాలని సూచించారు. అలాగే గర్భిణీలు బాలింతలు పిల్లలకు ప్రతిరోజు పాలు గుడ్లు, పప్పు ఆకుకూరలతో కూడిన ఆహారం అందించాలని సూచించారు

## పోలీస్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

### - పట్టణ సి ఐ రామకృష్ణ గౌడ్

జమ్మికుంట అక్టోబర్ 22 (వాయిస్ టుడే): తేదీ 22 10 2025 రోజున జమ్మికుంట పోలీస్ స్టేషన్లో కమిషనర్ ఆఫ్ పోలీస్ కరీంనగర్ ఉత్తర్వుల మేరకు జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ ఎస్ రామకృష్ణ తేదీ 21 10 2025 పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట లోని కాకతీయ స్కూల్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించి పోలీస్ వ్యవస్థ ఏ విధంగా పనిచేస్తుంది, పోలీస్ వ్యవస్థలో గల విధులు పోలీస్ వ్యవస్థలో గల కర్తవ్యాలు మరియు పోలీస్ స్టేషన్లో ఒక ఫిర్యాదును ఏ విధంగా తీసుకోబడుతుంది, డ్రంక్ అండ్ డ్రైవ్ , 100 డయల్ పనితీరు మరియు ఎఫ్ఐఆర్ ఏ విధంగా చేస్తారు , ఫిర్యాదు పై విచారణ ఏ విధంగా జరుగుతుంది అనే విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తూ ఒక సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది.







## కరీంనగర్ జాగృతిలో మహిళల చేరిక

కరీంనగర్,అక్టోబర్ 22(వాయిస్ టుడే): కరీంనగర్ జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా బ్యూటీ అసోసియేషన్ అధ్యక్షురాలు రూప తోపాటు పలువురు మహిళలు జాగృతిలో చేరారు.భవిష్యత్తులో కవిత నాయకత్వంలో పనిచేస్తామని మహిళగా కవిత ఈ సమాజానికి ఎంతగానో సేవ చేస్తున్నారని వారిని చూసి మాలాంటి వారందరము స్ఫూర్తి పొంది జాగృతి ద్వార ప్రజలకు సేవ చేయాలని ఆలోచనతో జాగృతిలో చేరడం జరిగిందని వారు అన్నారు. జాగృతిలో చేరిన వారందరికీ జాగృతి జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్,మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు అక్కం శివరాణి కండువాలు కప్పి వారిని జాగృతిలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కవిత జాగృతి సంస్థ ద్వారా చేసే పోరాటాలతో ఎంతో మంది మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం డిల్లీలో పార్లమెంటు సాక్షిగా జంతర్ మంతర్ దగ్గర దీక్షకు పూనుకొని కేంద్ర ప్రభుత్వంతో పోరాడి మహిళా రిజర్వేషన్ బిల్లు సాధించిన వారి దైర్యం మనందరికీ తెలిసిందే. దక్షిణ భారత దేశంలోనే అత్యంత శక్తివంతమైన మహిళగా జాగృతి అధ్యక్షురాలు కవిత ఉన్నారని, ఇప్పుడు ఉన్న రాజకీయలలో దక్షిణ భారతదేశంలో మహిళా నాయకత్వం లేదని మనకు కవిత రూపంలో ఆ లోటు తీరుతుందని హరిప్రసాద్ అన్నారు.తెలంగాణలో జాగృతిని మరింత బలోపేతం చేయడంలో మహిళల పాత్ర కీలకమని కవితను ఆదర్శంగా తీసుకొని చాలామంది మహిళలు జాగృతిలో చేరడం కోసం ముందుకు వస్తున్నారని అలాంటి వారందరినీ జాగృతిలోని ఆహ్వానిస్తున్నామని కవిత నాయకత్వంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల మీద ఈ ప్రభుత్వం మహిళలకు మహాలక్ష్మి పథకంలో 2500 ఇస్తా అని చెప్పి మోసం చేసిన విధానం మీద,అలాగే కళ్యాణలక్ష్మి క్రింద తులం బంగారం ఇవ్వకుండ మోసం చేసిందని, వృద్ధులకు నాలుగు పింఛన్ ఇస్తానని ఎగనామం పెట్టింది.ద్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల ఇవ్వడం లేదు, మహిళ విద్యార్థినిలకు స్కూటీ ఇస్తామని చెప్పి కూడ మోసం చేసిందని మహిళలను ఈ ప్రభుత్వం అన్ని విధాలుగా మోసం చేస్తుందని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో జాగృతి అటో సంఘం నాయకులు కోత్తూరి రఘు, మహిళ నాయకురాలు విజయ, అనుష, కవిత, శ్రీమతి, జ్యోతి,అనిష, రమ్య పాల్గొన్నారు.

## సుందరగిరి గ్రామంలో ప్రమాదకర విద్యుత్ స్తంభం .. ప్రజల ఆవేదన

**ప్రమాదం జరిగాక పరామర్శకు వస్తారా? అని ప్రశ్నిస్తున్న వార్డు ప్రజలు**

**చీకట్లో మరింత ప్రమాదం ద- చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి**



చిగురుమామిడి, అక్టోబర్ 22 (వాయిస్ టుడే) : చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామం 7వ వార్డులో సీసీ రోడ్డుకు నడిమధ్యలో ప్రమాదకరంగా ఒక విద్యుత్ స్తంభం నిలిచి ఉండటం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. వాహనదారులు, పాదచారులు ప్రతిరోజూ ప్రమాదభీతితో ప్రయాణిస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. ప్రజలు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు, గ్రామ పంచాయతీకి విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల వార్డు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. “ప్రమాదం జరిగాక పరామర్శకు వస్తారా?” అంటూ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చీకటి సమయంలో పరిస్థితి మరింత విషమంగా మారుతోందని, వెంటనే ఆ స్తంభాన్ని పక్కకు మార్చి అవసరమైన మరమ్మత్తులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## బోయినపల్లి పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**అమర పోలీసు వీరుల త్యాగాలు అందరికీ స్ఫూర్తిదాయకం- బోయినపల్లి ఎస్సై రమాకాంత్-**

**అమరుల త్యాగఫలం వలనే మనం ఈరోజు స్వేచ్ఛ స్వతంత్రంగా జీవిస్తున్నాం-వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్-**



వాయిస్ టుడే ప్రతినిధి బోయినపల్లి అక్టోబర్ 22 : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమాల్లో భాగంగా బోయినపల్లి పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించరు. బోయినపల్లి జడ్పిహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పోలీసు చట్టాల గురించి, సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాల గురించి, ఫింగర్ ప్రింట్ డివైస్, ట్రాఫిక్ ఎక్విప్మెంట్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ రమాకాంత్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాల గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాన్ని గౌరవించాలని రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఉత్సహకంగా పాల్గొన్నారు. గంజాయి,డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100, సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏ ఎస్ఐ మల్లేష్, హెడ్ కాన్స్టేబుల్ కనుకయ్య, శ్రీనివాస్ రావు, రిసెప్షన్ కానిస్టేబుల్ , సైబర్ క్రైమ్ కానిస్టేబుల్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
హైదరాబాద్
గురువారం, 23 అక్టోబరు 2025

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాసిల్దార్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలి

**- సిపిఎం పార్టీ మండల కార్యదర్శి చెల్పూరి రాము**



ఇల్లందకుంట అక్టోబర్ 22 (వాయిస్ టుడే): బుధవారం రోజున తాసిల్దార్ కార్యాలయం ముందు సిపిఎం మండల కార్యదర్శి రాము మాట్లాడుతూ,ఇల్లందకుంట మండల తాసిల్దార్ మధ్యాహ్నం 12 గంటలు దాటుతున్న కూడా సమయానికి రాకుండా మమ్ములను అడిగే వారు లేరు అని విధంగా తన ఇష్టం వచ్చినట్టు టైం కు వస్తూ తాసిల్దార్ ఆఫీస్ కు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి చూస్తూ ఇబ్బందులకు గురి అవుతున్నారు అని అన్నారు. రిజిస్ట్రేషన్స్ ఉంటే ఉదయాన్నే వస్తున్నారు. రిజిస్ట్రేషన్ లేకుంటే ఆఫీసుకు ఎప్పుడొస్తారో ఎప్పుడు పోతారు అంతా తన ఇష్టమని అన్నారు. విధుల పట్ల ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తాసిల్దార్ పైన ఉన్నంత అధికారులు స్పందించి శాఖపరమైన చట్టపురమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల జిల్లా కలెక్టర్ కి మరియు ఉన్నంత అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా అన్నారు.

## జూదంపై పోలీసుల దాడి .. ఏడుగురు అరెస్ట్



చిగురుమామిడి, అక్టోబర్ 22 (వాయిస్ టుడే): చిగురుమామిడి పోలీస్ స్టేషన్ పరిధిలోని నవాబుపేట శివారులో జూదం ఆడుతున్న ముఠాపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం ఆధారంగా స్థానిక పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఈ దాడి నిర్వహించారు. దాడిలో ఠాకూర్ నరేందర్ సింగ్, ఠాకూర్ రాణా ప్రతాప్ సింగ్, మ్యాకల రాజేందర్, బోయిని దుర్గయ్య, బోయిని ఎల్లయ్య, దోనపాటి కిష్టారెడ్డి, సుద్దాల ప్రవీణ్ లను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు పేకాట ఆడుతున్న వారి వద్ద ?1770 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరు చట్టవిరుద్ధంగా కార్డులు ఆడుతున్నట్లు నిర్ధారణ అయింది. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఇటువంటి జూదం, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అన్నారు. పట్టుబడిన వారిపై సంబంధిత కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## జిల్లా ఎస్పీని సన్మానించిన హ్యూమన్ రైట్స్ సభ్యులు



తొర్రూరు, అక్టోబర్ 22 వాయిస్ టుడే : మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం తొర్రూరు డివిజన్ కేంద్రానికి చెందిన హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళ పెల్లి హుస్సేన్ , టీం సభ్యులు కలిసి జిల్లా ఎస్పీ శ్రీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంగళపల్లి హుస్సేన్ మాట్లాడుతూ దేశ సరిహద్దులో సైనికులు ఎంత ముఖ్యమో దేశంలో పోలీసు వ్యవస్థ అంతే అవసరమన్నారు. దానికి అనుగుణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు రాష్ట్ర తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డీజీపీ శశిధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఇటీవలే జిల్లాలోని రైతాంగానికి యూరియా సరఫరా విషయంలో సమస్యలు లేకుండా, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సమర్థవంతంగా పనిచేయడం, వరదల సమయంలో 18 మండలాల ఎస్సైలను సిఐలను ,డీఎస్పీలను అప్రమత్తం చేసి ప్రజల ప్రాణాలు కాపాడడం, జిల్లాలో డ్రగ్స్ నివారణ విషయంలో ఆయన చేస్తున్న సేవలకు స్పందించి హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీ ని అభినందించి సన్మానం చేయడం జరిగిందన్నారు. పోలీస్ వ్యవస్థ అంటేనే నమ్మకం అని హుస్సేన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం లాలయ్య, మహబూబాబాద్ జిల్లా జనరల్ సెక్రెటరీ పాక ధర్మేశ్వరరావు,జాయింట్ సెక్రెటరీ గండి మురళి పాల్గొన్నారు.

## పత్రికా కార్యాలయాలపై దాడికి యత్నించడం దుర్మార్గం

**వరంగల్ జిల్లా టీయూడబ్ల్యూజే**

వరంగల్ ( వాయిస్ టుడే) అక్టోబర్ 22 : వార్తా పత్రికల కార్యాలయాలపై భౌతిక దాడులకు ప్రయత్నించడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్ 143) వరంగల్ జిల్లా అధ్యక్షులు కొరుకొప్పుల నరేందర్, ప్రధాన కార్యదర్శి వాంకె శ్రీనివాస్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా నమస్తే తెలంగాణ ఎడిషన్ కార్యాలయం పైకి అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు దాడికి యత్నించడం దుర్మార్గమన్నారు. వార్తల విషయంలో బేధాభిప్రాయాలు ఉంటే న్యాయపరంగా, చట్టపరంగా ముందుకెళ్లాలి. కానీ ఈ రకమైన భౌతిక దాడులకు ప్రయత్నించడం సమంజసం కాదని, భావ ప్రకటన స్వేచ్ఛకు ఇది గొడ్డలి పెట్టని విచారం వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన మీడియా స్వేచ్ఛ హక్కును హరించే విధంగా వ్యవహరించినవారితో పాటు దాడికి పరోక్షంగా కారుకులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడిని ఖండించిన వారిలో టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి రాపెల్లి ఉపేందర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు మిట్ట నవనీత్, ప్రధాన కార్యదర్శి నీలం శివలు ఉన్నారు.

## మెట్లపై జారి పడిన కాంగ్రెస్ యువ నాయకుడు మృతి



వాయిస్ టుడే, రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22బీ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సంజీవయ్య నగర్ కు చెందిన కొండా శేఖర్ (26) అనే యువకుడు ప్రమాదవశాత్తు మెట్లపై జారిపడి మరణించాడు. రాత్రి మద్యం దుకాణం పర్మిట్ రూమ్ లో మద్యం తాగి క్రిందికి దిగుతుండగా ఈ సంఘటన జరిగింది. తలకు తీవ్ర గాయాలైన కొండ శేఖర్ ను ఆసుపత్రికి తరలించగా అప్పటికీ మృతి చెందిన వైద్యులు తెలిపారు. చిన్న వయసులోనే కొడుకు మరణించడంతో తల్లిదండ్రుల రోదనతో ప్రభుత్వ ఆసుపత్రిలో చూస్తున్న అందరూ కలత చెందారు. స్థానిక కాంగ్రెస్ నేతలు ఆర్థికంగా ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభంచిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం**

**ప్రతి గింజను కొనుగోలు చేస్తాం..**



వాయిస్ టుడేబీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం కనగర్తి, చందుర్తి మండలం సనుగుల గ్రామాలలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో, అలాగే వట్టిమల్ల గ్రామంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ టీ సెర్ప్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ నగేష్ మరియు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, దేశానికి పెట్టేదు అన్నం పెట్టేది రైతన్నే అని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఏ రకం ధాన్యంకు ?2389, బి రకం ధాన్యంకు ?2369 మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గారు ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు నేటికీ నిర్విరామంగా కొనసాగుతున్నాయన్నారు. రైతులకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ చేస్తే, ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏక కాలంలో రుణమాఫీ చేసామని గుర్తు చేశారు. సన్నం వడ్లకు ?500 బోనస్ ప్రకటించడం జరిగిందని, 25 లక్షల కోట్లతో రైతులకు రుణమాఫీ చేశామని వెల్లడించారు. గత ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇచ్చి ఉంటే రుణమాఫీలో రైతులకు మరింత మేలు జరిగేదని, గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసిందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని, గత ప్రభుత్వంలో వివిధ హోదాల్లో ఉన్న వారి ఊర్లకు సైతం కాంగ్రెస్ పార్టీ రోడ్లు వేసిందని తెలిపారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, స్థానిక కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు అమ్మితే ఊరుకోం..

**కుడా వేలాన్ని అడ్డుకుంటాం.. వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి**

**బీజేపీ హన్మకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి**



హనుమకొండ, వాయిస్ టుడే: ప్రభుత్వ ఆదాయం కోసం కుడా విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టడం తగదని.. ఈ చర్యను బీజేపీ వ్యతిరేకిస్తోందని హన్మకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి హెచ్చరించారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రావు పద్మారెడ్డి మాట్లాడుతూ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (కుడా) ఆధ్వర్యంలో హన్మకొండలోని బాలసముద్రంలో ఉన్న 2.27 ఎకరాల (12,957 చదరపు గజాల) ప్రభుత్వ భూమిని బహిరంగ వేలంపాట ద్వారా విక్రయించాలని చూడటం దారుణమని మండిపడ్డారు. ప్రభుత్వ ఖజానాను నింపుకోవడం కోసం ఉన్న భూములను అమ్ముకోవడం సిగ్గుచేటన్నారు. ఇది ప్రజల ఆస్తిని దోచుకోవడమేనని, ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడానికి వేరే వనరులను అన్వేషించుకోవాలి కానీ భవిష్యత్ తరాల కోసం కాపాడాల్సిన భూములను అమ్మివేయడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. ప్రభుత్వ భూములను విక్రయించడాన్ని బీజేపీ పూర్తిగా వ్యతిరేకిస్తోందని, కుడా ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ వేలంపాటను ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వమని పేర్కొన్నారు. బీజేపీ శ్రేణులతో కలిసి వేలాన్ని అడ్డుకుని తీరుతామని రావు పద్మారెడ్డి తెలిపారు. తక్షణమే వేలం నిర్ణయాన్ని కుడా అధికారులు, ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని రావు పద్మారెడ్డి తెలియజేశారు.

## విద్యార్థినీ విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం

**పోలీస్ అమరవీరుల సంస్మరణ వారికోత్సవాలు**

**జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య**



వాయిస్ టుడేబీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్స వాల్లో భాగంగా సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పోలీసు సిబ్బంది విధులకు వాడే వివిధ ఆయుధాలను, పోలీస్ స్టేషన్ లోని కార్యకలాపాలను విద్యార్థులు చూసి తెలుసుకునే అవకాశం ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ద్వారా కలిగింది. ఈ కార్యక్రమం పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, వారి సేవలకు ప్రతిఫలం చూపుతూ, విద్యార్థులకు పోలీసు విధుల గురించి అవగాహన పెంచేందుకు నిర్వహించడం జరిగింది. అని అన్నారు. స్థానిక సీఐలు, ఎస్సైలు, వివిధ శాఖల పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## కురవిలో డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ మంజూరు

మహబూబాబాద్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 22 : మహబూబాబాద్ జిల్లా కురవి మండల ప్రజల దీర్ఘకాల కోరిక నెరవేరింది. కురవి మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ మంజూరైనట్లు అధికారికంగా ప్రకటించడంతో గ్రామీణ ప్రాంత ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా డీసీసీబీ బ్యాంకు చైర్మన్ ఎం. రవీందర్ రావు, సీఈఓ వజీర్ సుల్తాన్ గారికి కృతజ్ఞతలు తెలుపుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి డి. వై. గిరి మాట్లాడుతూ మండల ప్రజల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయం ప్రశంసనీయమైందని, రైతులు, స్వయం సహాయక సంఘాలు, చిన్న వ్యాపారవేత్తలు, ఉద్యోగులు అందరికీ ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని, గత సంవత్సరంగా మేము డీసీసీబీ చేస్తున్న విజ్ఞప్తి మన్నించి కురవిలో బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు చేయడం పట్ల డి. వై. గిరి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తట్టుపల్లి గ్రామ నాయకులు కోటోజు బ్రహ్మం, గట్ల జగన్, అంతటి యాలాద్రి, దొంతు రాజేశ్వర్, బుక్కరాజు శేఖర్ తదితరులు పాల్గొని డీసీసీబీ బ్యాంక్ సీఈఓ సుల్తాన్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సౌకర్యం దృష్ట్యా కురవి మండల కేంద్రం లో బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## సిఐటియు మహాసభ విజయవంతం చేయాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు మహాసభలో పాల్గొనాలి**

వాయిస్ టుడే రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిఐటియు సిరిసిల్ల జిల్లా 4 వ. మహాసభల విజయవంతానికి జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు సహకరించాలి. అక్టోబర్ 29,30 తేదీలలో సిరిసిల్లలో జరిగే సిఐటియు జిల్లా మహాసభల కరపత్రం ఆవిష్కరణ. బి.వై. నగర్ లోని కామ్రేడ్.. అమృత్ లాల్ శుక్లా కార్మిక భవన్ సిఐటియు జిల్లా కార్యాలయంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అక్టోబర్ 29,30 తేదీలలో సిరిసిల్లలో జరిగే మహాసభల నిర్వహణ , ప్రచార ఏర్పాట్లు , నిధి వసూలు తదితర అంశాలపై చర్చించడం జరిగింది సమావేశం అనంతరం జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు, మూషం రమేష్ , గుర్రం అశోక్ , అన్నల్దాస్ గణేష్ , గురజాల శ్రీధర్ , సూరం పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన వీరుడు కొమురం భీమ్

## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొమురం భీమ్ జయంతి



హనుమకొండ, వాయిస్ టుడే: జల్ జంగల్ జమీన్ నినాదంతో ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన యోధుడు కొమురం భీమ్ అని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. బుధవారం కొమురం భీమ్ జయంతి వేడుకలను హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివాసులకు జరుగుతున్న అన్యాయంపై పోరాడిన పోరుబిడ్డ అని కొనియాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదివాసీ బిడ్డ కొమురం భీమ్ కు సముచిత గౌరవం ఇవ్వడం జరిగిందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ నాయకత్వం కొమురం భీమ్ పేరిట జిల్లా ఏర్పాటు చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. కొమురం భీమ్ జయంతులు, వర్ధంతులు అధికారికంగా నిర్వహించడం జరిగిందని తెలియజేశారు.

**నాయిని నర్సింహా రెడ్డి కార్మిక పక్షపాతి..**

దివంగత మాజీ హోంమంత్రి నాయిని నర్సింహా రెడ్డి కార్మిక పక్షపాతి అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్, కో ఆర్డినేటర్ పులి రజినీకాంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో దివంగత మాజీమంత్రి నాయిని నర్సింహా రెడ్డి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఆయన ఎంతో కీలక భూమిక పోషించారని అన్నారు. టీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యులుగా పార్టీకి ఎంతో సేవ చేశారని, కార్మిక శాఖ మంత్రిగా హోం శాఖ మంత్రిగా నాయిని నర్సింహా రెడ్డి తెలంగాణకు ఎనలేని సేవలు చేశారని తెలిపారు. కార్మికుల కోసం అనేక చట్టాలను అమలు చేయడంలో ఆయన కీలకంగా వ్యవహరించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జోరిక రమేష్, మేకల బాబు రావు, నాయకులు బీఆర్ఎస్ పార్టీ హసన్‌పర్తి మండల అధ్యక్షులు బండి రజినీకుమార్, సల్వాజి రవీందర్ రావు, గౌస్ ఖాన్, సౌరం రఘు, మహేష్, చాగంటి రమేష్, బైరపాక ప్రశాంత్, పెరుకారి శ్రీధర్ రావు, దేవమ్మ, వరుణ్, సంపతి రఘు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



## ముష్టిపల్లి, చంద్రంపేటలో ఐకెపి సెంటర్లను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ వేల్ముల స్వరూప

రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేల్మూలా స్వరూప, మహిళా స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో ముష్టిపల్లి, చంద్రంపేట గ్రామాలలో ఏర్పాటు చేసిన కొత్త ఐకెపి సెంటర్లను ప్రారంభించారు. ఈ కేంద్రాలు మహిళల ఆర్థిక స్వావలంబనకు , సాధికారతకు తోడ్పడతాయని ఆశిస్తున్నారు. ఈ సెంటర్లను ప్రారంభించడం ద్వారా, మహిళలు ఆర్థికంగా బలపడటానికి, మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవడానికి ఒక ముఖ్యమైన అడుగు పడింది. అని అన్నారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, కాంగ్రెస్ పట్టణ, గ్రామ నాయకులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.



## గన్నవరం దళితవాడలో ఘనంగా వల్లభనేని వంశీ జన్మదిన వేడుకలు

కృష్ణా జిల్లా గన్నవరం: వల్లభనేని వంశీ పేద ప్రజల ఆపద్బాంధవుడని సీనియర్ నాయకులు అనగాని రవి అన్నారు. గన్నవరం దళితవాడలో తిరివీధి దినేష్,కలపాల డేవిడ్ ఆధ్వర్యంలో డైనమిక్ లీడర్, పేద ప్రజల పాలిట పెన్నిధి, మాజి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న సీనియర్ నాయకులు అనగాని రవి ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనగాని రవి మాట్లాడుతూ వంశీ నియోజకవర్గంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారాని,అటువంటి మహనీయుడు మన నియోజకవర్గంలో నాయకుడి గా ఉండటం పేద ప్రజల కు వరమని అన్నారు.ఎస్సి నాయకులు నిడమర్తి రామారావు ,రాచేటి రుతమ్మ మాట్లాడుతూ వంశీ పేద ప్రజలకు ఎన్నో విధాలుగా చారిటబుల్ ట్రస్టు ధ్వరా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసేసారని,ఆయన సొంత నిధుల తో చదువులకు,వైద్య ఖర్చుల ధ్వరా ఎన్నో కుటుంబాలకు ఆపద్బాంధవుడిగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, మహిళలు, వైసిపి అభిమానులు భారీగా పాల్గొన్నారు



## ఘనంగా వల్లభనేని వంశీ జన్మదిన వేడుకలు

కృష్ణా జిల్లా(గన్నవరం) : ఉంగుటూరు(మం) ఆత్కూరు లో డైనమిక్ లీడర్, పేద ప్రజల పెన్నిధి,మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. భారీ కేకు ను కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో కోటా చంటి,తొందురు ప్రసాద్,వల్లూరు శ్రీనివాస్, షేక్ బుడే,కుర్రా సుబ్బారెడ్డి, కొమ్ము కిరణ్,సొంగా నరేంద్ర, బొర్రా వెంకట్ రెడ్డి,మల్లి రెడ్డి రాజేష్, పాతపాటి నాగబాబు, సొంగా వినయ్,మెడెం రాంబాబు, దాసు, నాయక్ పాల్గొన్నారు.



## ముస్తాబాద్ గ్రామంలో ఘనంగా వల్లభనేని వంశీ పుట్టినరోజు వేడుకలు

కృష్ణా జిల్లా గన్నవరం : గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో మర్రిచెట్టు సెంటర్ వద్ద బండారుపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మాజీ శాసనసభ్యులు వల్లభనేని వంశీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్స్ , పండ్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మేచినేని బాబు , ఎలిజిబెత్ రాణి, మాజీ సర్పంచ్ కైలే ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మున్ని, ఆజాం, షరీఫ్, బాజీ, నరసింహారెడ్డి, మేచినేని విజయ్, పల్లి వీరయ్య, శ్రీకాంత్, నక్కా మధు, కూరేటి తంబి , మోరం నాని, సుభాని, ధన కోటేశ్వరరావు, నంద, నరేష్, రాజేష్, జగపతి , ఎద్దు నాగబాబు, చిన్ని, విజయ్ , ఉదయ భాస్కర్ మరియు బండారుపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్

రామకృష్ణాపూర్ అక్టోబర్ 22 (వాయిస్ టుడే) : పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్లో బుధవారం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై జి రాజశేఖర్ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ లో ఉండే రిసెప్షన్ వ్యవస్థ, కేసు డైరీలు స్టేషన్లో ఉపయోగించే ఆయుధాలు ,విధులు, సైబర్ మోసాలు ,చట్టాలపై అవగాహన కల్పించారు.




# బాబు క్యాంపు ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే అక్టోబర్ 22: పీఎం బాబు క్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చుంచుపల్లి మండలంలోని పీఎం బాబూకాంప్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఈరోజు ఉదయం 11 గంటల సమయం లో ఆకస్మికంగా సందర్శించారు. ఆ సమయం లో పాఠశాల పరిసరాల శుభ్రత ను, గార్డెన్ ను పరిశీలించారు. గార్డెన్ లో పెరిగిన పిచ్చి కలుపు మొక్కలను తీసివేయాలని హెచ్ ఎం నీరజ ను, ఉపాధ్యాయులకు సూచించారు. పీఎం పాఠశాల యెక్క నిర్వహణ విధి విధానాలను మొత్తంగా పాఠశాల లో నిర్వహిస్తున్న అనేక అంశాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు నీరజ ను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా పాఠశాల పరిశు భ్రతా కార్యక్రమం లను ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. తదుపరి, రెండు సెక్షన్ ల పదవ తరగతి గదుల్లోనికీ వెళ్లారు. ఆ సమయం లో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయులు వెంకటేశ్వరావు, ఉషారాణి లు భోదిస్తున్నారు. ఐఎఫ్పి(ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ఫైనల్ ) టీవీ లను ఉపయోగిస్తున్నారా , వీటి ద్వారా పాఠ్యంశాలను బోదిస్తున్న తీరు ఎలా ఉందని, ఖాన్ అకాడమీ లో విద్యార్థులను రిజిస్టర్ చేసారా అని అడిగారు. ఎస్ ఏ -1 పరీక్షలకు సిద్ధం అవుతూనే, మార్చి2026 జరిగే పబ్లిక్ పరీక్షలకు సుమారు 16 వారములు సమయం ఉన్నందున ప్రణాళికబద్ధంగా అన్ని సబ్జెక్ట్స్ ను చదువుకునేలా విద్యార్థులకు తగిన విలువైన సూచనలు తెలియ చేసారు. ఉపాధ్యాయుల బోధనపై పాఠశాల పనితీరుపై, సంతృప్తి వ్యక్తం చేసారు.






## గాలి కుంటు వ్యాధి నివారణ పశు వైద్య శిబిరాలు విజయవంతం

### ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు

ముదిగొండ మండలం అక్టోబర్ 22 వాయిస్ టుడే : ముదిగొండ మండలంలో బుధవారం పమ్మి, సువర్ణాపురం,న్యూ లక్ష్మీపురం గ్రామాలలో జాతీయ పశు వ్యాధుల నివారణలో భాగంగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాలు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి శ్రీనివాస్ రావు, మండల వైద్యాధికారి డాక్టర్ అశోక్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాలలో వైద్య బృందాలతో పశుపోషకులు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా చేయించాలని గాలికుంటు అంటువ్యాధి సోకిన పశువులు అధిక జ్వర తీవ్రతతో నోట్లో పొక్కులు పుండ్లుగా మారి నొప్పి వలన మేత మరియు నీరు తీసుకోకుండా నీరసించి పోతాయి ఎడ్లు వ్యవసాయ పనులకు సహకరించలేవని కావున ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరూ తమ పశువులకు టీకాలు వేయించాలని తెలిపారు. వ్యాధి సోకకుండా పశువుల పాకలను ప్రతిరోజు శుభ్రపరిచి అపరిశుభ్రంగా లేకుండా చూసుకోవాలని తెలిపారు.అనంతరం జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి బి.శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీలో భాగంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పశువులకు టీకాలు పూర్తి చేయాలని సూచించారు అనంతరం ఇందిరా మహిళా డైరీ గేదెలను పమ్మి మరియు సువర్ణపురం,న్యూ లక్ష్మీపురం గ్రామాలలో పరిశీలించి పాల ఉత్పత్తికి నుంచి లబ్ధిదారులకు తగు జాగ్రత్తలు సూచించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇందిరా మహిళ డైరీ ఏపీఎం లక్ష్మణ రావు మరియు ముదిగొండ మండల ఏపీఎం సత్య నారాయణ, వీఓఏ ఉమా, పశు వైద్య సిబ్బంది,గోపాల మిత్రలు,గ్రామస్తులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆ వార్తల్లో నిజం లేదు...

### రాజన్న ఆలయంలో దర్శనాలు నిలిపివేతపై స్పందించిన ఈ.ఓ రమాదేవి



రాజన్న సిరిసిల్ల జిల్లా బీఅక్టోబర్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని దక్షిణ కాశీగా పేరు గాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో నేటి నుండి దర్శనాలు నిలిపివేత, భక్తులకు తీవ్ర ఇబ్బందులు అంటూ బుధవారం ఉదయం ఆయా సామాజిక మాధ్యమాలతో పాటు కొన్ని మీడియా చానెళ్లలో కథనాలు వెలువడ్డాయి. ఈ విషయం కాస్తా చాలా వైరల్ గా మారి తీవ్ర గందరగోళానికి దారి తీసింది. అయితే తాజాగా ఈ విషయంపై ఆలయ ఈ.వో ఎల్. రమాదేవి స్పందించారు. ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్న తరుణంలో ప్రస్తుతం ఆలయం లోపల ఉన్న ఇనుప రేకుల తొలగింపు పనులు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా పనులు జరిగినంత సమయం సుమారు 30నిమిషాలు మాత్రమే ఆలయంలోనికి భక్తుల దర్శనానికి అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

కానీ కొంతమంది వ్యక్తులు భక్తులను తప్పుదోవ పట్టించేలా సోషల్ మీడియా వేదికగా అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయ దర్శనాల విషయంపై సోషల్ మీడియాలో వస్తున్న సందేశాలను చూసి భక్తులు తొందరపడవద్దని, ఆలయానికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా తమ నుండి అధికారకంగా విడుదల చేస్తామని, అంతేగానీ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నమ్మి ఆందోళన చెందవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

## వేములవాడ రాజన్నను దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి



వాయిస్ టుడే, రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ సతీమణి అపర్ణ , స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కళ్యాణ మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. వారికి ఆలయ ఈవో ఎల్. రమాదేవి గారు స్వామి అమ్మవార్ల వస్త్రాలు, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు.



## అక్టోబర్ 26న బెల్లంపల్లిలో సింగరేణి జాబ్ మేళా

### 7 వేల మంది నిరుద్యోగ యువత ఉపాధి పొందే దిశగా ఏర్పాట్లు

### మందమర్రి ఏరియా జీఎం ఎన్.రాధాకృష్ణ

మందమర్రి అక్టోబర్ 22 (వాయిస్ టుడే) : సింగరేణి ప్రాంత నిరుద్యోగ యువతకు వివిధ ప్రైవేట్ కంపెనీలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం బెల్లంపల్లి లో ఈనెల26న సింగరేణి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ తెలిపారు. బుధవారం జి.ఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్, సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం ఆదేశాల మేరకు బెల్లంపల్లి ఏఎంసి గ్రౌండ్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సంస్థ ,నోబెల్ ఎంపవర్మెంట్ వారిచే సంయుక్తంగా మెగా జాబ్ మేళా ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటారని, దాదాపు 7వేల మంది నిరుద్యోగ యువత ఉపాధి పొందే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు . ఈ జాబ్ మేళాకు మందమర్రి,బెల్లంపల్లి పరిసర ప్రాంతాలలోని నిరుద్యోగ యువత రానున్నట్లు సూచన ప్రాయం ప్రాయంగా తెలియజేశారు. మ్యానుఫ్యాక్చరింగ్, రిటైల్, ఐటీ ,నాన్ ఐటీ డిజిటల్ మార్కెటింగ్ సర్వీస్ సెంటర్లకు చెందిన ప్రముఖ సంస్థలు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు ఉత్పత్తి కే పరిమితం కాకుండా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ముందుంటుందని తెలిపారు. ఉద్యోగాల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా వారి సొంత ప్రాంతంలోనే వివిధ రంగాల ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు పొందేలా ఈ వేదికను ఏర్పాటు చేస్తున్నామని భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని జి ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం విజయ ప్రసాద్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, ఐ ఈ డి ఎస్ ఈ కిరణ్ కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, గోగర్ల శోభన్ బాబు నోబెల్ ఎంపవర్మెంట్ స్టేట్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న శంకర్‌పల్లి ఫోటోగ్రాఫర్స్ యూనియన్

చేవెళ్ల..అక్టోబర్ 22(వాయిస్ టుడే)శంకర్ పల్లి మండలం ఏర్వర్తి గ్రామానికి చెందిన తన తోటి స్నేహితుడు కృష్ణ కు గత నాలుగు రోజుల క్రితం శంకర్ పల్లి పత్తేపురం బ్రిడ్జ్ పై రాత్రి రెండు గంటల సమయంలో ప్రోగ్రామ్ ముగించుకుని తన బైక్ తీసుకొని సొంత గ్రామానికి వెళుతుండగా అకస్మాత్తుగా ముందు ఉన్న వాహనం సడన్ గా రావడంతో అక్కడ ఉన్న డివైడర్ కు ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలైన ఉన్న కృష్ణను చూసి అక్కడ ఉన్న స్థానికులు సంగారెడ్డి బాలాజీ హాస్పిటల్ కి తరలించగా సమయానికి తీసుకెళ్లడంతో తప్పిన ప్రమాదం ఉదయం ఈ విషయం తెలుసుకున్న ఫోటోగ్రాఫర్లు యూనియన్ ప్రెసిడెంట్ రాజు, విజయ్ కుమార్ మాణిక్యం తన స్నేహితులు కలిసి 23,800 రూపాయలను తన కుటుంబానికి అందించడం జరిగింది మానవత్వం చాటుకున్న శంకర్ పల్లి ఫోటోగ్రాఫర్స్ యూనియన్ ని అందరూ అభినందించారు.



## గ్రామాల అభివృద్ధి నిరంతర ప్రక్రియ ఎమ్మెల్యే కాలే యాదయ్య

చేవెళ్ల...అక్టోబర్ 22(వాయిస్ టుడే)షాబాద్ మండలం హైతాబాద్ గ్రామంలో కోటి రూపాయల నిధులతో నూతన సీసీ రోడ్ల పనులకు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన చేసిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని చేవెళ్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి క్వింటాల్‌కు రూ. 8,100
# సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవచ్చు

**రైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా ఎలాంటి దళారులు లేకుండా ఈజీగా అమ్ముకోవచ్చు**

**త్వరలో గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి**



వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 23 హుస్నాబాద్ ప్రతినిధి : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని పట్టణ శివారులో గోమాత మిల్లులో మొట్టమొదటి సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు అంతేకాకుండా పత్తిని పరీక్షించి తేమయొక్క శాతాన్ని పరిశీలన చేశారు అయితే కాటన్ కార్పొరేషన్ ఇండియా 12 రాష్ట్రాల్లో టపాస్ కిసాన్ మొబైల్ యాప్ కింద ఆన్లైన్ ద్వారా రైతు మిల్లుకు అమ్ముకోవాలనుకుంటే మిల్లుకు అమ్ముకునే సదుపాయాన్ని టపాస్ కిసాన్ యాప్ ద్వారా అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు అంతేకాకుండా ఇది కొనుగోలు కేంద్రాన్ని సూచిస్తుందని... వారు మనకు తేదీని స్లాట్ ఇస్తారని తెలంగాణలో మొదటి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఈరోజు ప్రారంభించుకున్నామని తెలియజేశారు... ప్రతి రైతుకు మద్దతు ధర 8100 ధర పలుకుతుందని రైతులు తమ పంటను ధైర్యంగా అమ్ముకోవచ్చని తెలియజేశారు ఈసారి భారీ వర్షాలు పడడం వల్ల కొంత పత్తి తక్కువగా ఉందని కాబట్టి రైతులు సీసీఐకి అమ్ముకొని అధిక లాభాలు అర్థించుకోవాలని తెలియజేశారు అంతేకాకుండా టపాస్ కిసాన్ ద్వారా రాజమార్గం ద్వారా పత్తిని అమ్ముకోవచ్చని తెలిపారు... ఈరోజు మొక్కజొన్నలకు కొనుగోలను కూడా హుస్నాబాద్ లో ప్రారంభించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సంబంధించి ఏ ఇబ్బంది లేకుండా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలియజేశారు. మరియు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి మొక్కజొన్న కేంద్రాలు ప్రారంభించి రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించిందని తెలియజేశారు అన్ని కొనుగోలు కేంద్రాలు రైతులకు వినియోగంలోకి వస్తాయని తెలియజేశారు మరియు మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మూడు జిల్లాల పరిధిలో ఉన్న హుస్నాబాద్ లో పత్తి కొనుగోలను ప్రారంభించుకున్నాం కాబట్టి సన్న వడ్లకు 500 బోనస్ ఇస్తున్నాం వడ్లను కొనుగోలు చేసిన 48 గంటల్లోగా రైతులకు డబ్బులు పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలియజేశారు అంతేకాకుండా నిన్ననే అక్కెన పేటలో సన్నవర్ విత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని నర్మెటలో ఇప్పటికే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.... ఇప్పటికే కూడా పూర్తి కావడం జరిగిందని పేర్కొన్నారు అంతే కాకుండా ఆయిల్ ఫామ్, హార్టికల్చర్, సెరికల్చర్ పై అవగాహన కలగాలని రైతులకు ప్రత్యేక కార్యక్రమాలు చేస్తున్నామని అంతేకాకుండా రైతులు ఎవరైనా ఆయిల్ ఫామ్ గురించి మరియు ఇతర పంటల గురించి తెలుసుకోవాలనుకుంటే వారికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని తెలియజేశారు రైతులు లాభాలు ఉండే పంటలు వేయాలని... దానివలన అధిక దిగుబడి వచ్చి రైతులు లాభాలు గడిస్తారని తెలియజేశారు రైతులకు ప్రభుత్వం ఇస్తున్న అన్ని కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలని త్వరలోనే గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసుకొని పంటపొలాలకు నీరు అందిస్తామని తెలియజేశారు అంతేకాకుండా మొక్కజొన్న కేంద్రాన్ని ప్రారంభించి మొక్కజొన్నకు 2400 మద్దతు ధర పలుకుతుందని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో అమ్ముకోవచ్చని ప్రజలు దళారుల వద్దకు వెళ్లకుండా రైతు మార్కెట్కి వెళ్లి తమ పంటలు అమ్ముకొని లాభాలు అర్థించుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె హైమావతి గ్రంథాలయ సంస్థ చైర్మన్ కెడం లింగమూర్తి హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ హుస్నాబాద్ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి వైస్ చైర్మన్ బంక చందు డైరెక్టర్లు ఇతర ముఖ్య నేతలు అధికారులు మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిత్తారి రవీందర్ మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ దండి లక్ష్మి వల్లపు రాజు కాంగ్రెస్ సీనియర్ నాయకులు బూరుగు కృష్ణస్వామి పెరుమల నర్సాగౌడ్ మైదంశెట్టి వీరన్న మార్కెట్ డైరెక్టర్ బిక్య నాయక్ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి నాయిని రజిత మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

**నాణ్యతమైన గొనె సంచులను అందించాలి ...**

**కొనుగోళ్ళ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి**

**బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి**

వాయిస్ టుడే ప్రతినిధి, అక్టోబర్ 23 హుస్నాబాద్ ప్రతినిధి సిద్దిపేట జిల్లా: హుస్నాబాద్ పట్టణం లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో జరుగుతున్న ప్రభుత్వ ధాన్యం కొనుగోళ్ళ ను వేగవంతం చేసే విధంగా అధికారులు చూడాలని బి ఆర్ యస్ పార్టీ కోరుతుంది మార్కెట్ యార్డ్ లో ధాన్యం కొనుగోళ్ళను ప్రారబించి 15 రోజుల గడిచినాది కానీ కేవలం రెండు ఐదు వేల వందల కింటల్ మాత్రమే కొనుగోళ్ళు జరిగినావి మార్కెట్ యార్డ్ లో దాదాపు , ఎనిమిది వేల కింటల్ వరకు ఉన్నాయి వాతావరణ శాఖ అధికారులు వర్షాలు పడే చూచనలు ఉన్నాయి చెప్పుతున్నారు కానీ రోజుకు ఎనిమిది వందలు కింటాలకు వరకు మాత్రమే బార్దాన్ సంచులు యిస్తున్నారు మార్కెట్ యార్డ్ ధాన్యం అంత నిండి ఉన్నాయి ఇప్పటికీ కూడ ఇంకా కొన్ని మిల్లులకు కొనుగోళ్ళకు ఆలాట్ మెంట్ రాలేదు అని సొసైటీ అధికారులు చెప్పుతున్నారు అదేవిధంగా కొనుగోళ్ళకు ఇచ్చిన బార్దర్ సంచులు మొత్తం రంధ్రాలు పడి ఉన్నాయి దానితో కంటాలు పెట్టినా తరువాత ధాన్యం సంచులు ను%శీ%డి రాలి పోతే రైతులకు నష్టం వచ్చే పరిస్థితి ఉంది కనీసం ఇప్పటికైన నాణ్యమైన బార్దన్ రైతులుకు అందించాలని కోరుతున్నాం మరియు పాడి క్లీనర్స్ రైతులకు సరి పడే విధంగా చూడాలని కోరుతున్నాము వర్షాలు వచ్చే పరిస్థితి ఉంటే యార్డ్ లో సరి పడే అన్ని తారీపిన్ కవర్స్ ఉంచాలని కోరుతున్నాము యార్డ్ లో రైతు ఎలాంటి ఇబ్బందులు లేకుంటే చూడాలి లేకుంటే రైతుల పక్షాన బి ఆర్ యస్ పోరాడుతుంది అని తెలుపుతున్నాం ఈ కార్యక్రమం లో బి ఆర్ యస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీష్ బి ఆర్ యస్ పార్టీ యూత్ పట్టణ అధ్యక్షులు మేకల వికాస్ యాదవ్ మరియు రైతులు పాలుగోన్నారు

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి యువకుడు మృతి



వాయిస్ టుడే మహబూబ్నగర్ జిల్లా అక్టోబర్ 22 : (జడ్చర్ల ) నవాబు పేట్ మండలం పరిధిలో ఉన్న యన్మన్ గండ్ల గ్రామం చెందిన సాకలి జగదీష్ వయసు 28 బుధవారం అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ గౌడ్, అనే వ్యక్తి ఆయన పంట పొలానికి నర్సరీ నుండి చెట్లు తీసుకొని పొలానికి దింపడానికి వెళ్లగా పొలం ఆవరణంలో చెట్ల మధ్య విద్యుత్ వైర్లు బులోరా వాహనానికి అడ్డురాగా వైర్లను తప్పిస్తున్న తరుణంలో ప్రమాదాశరత్తుగా విద్యుత్ షాక్ తో అక్కడికక్కడే మృతి చెందాడు మృతుడుతో పాటు ఉన్న నలుగురు వ్యక్తులు ఉండగా షాక్ రావడంతో ప్రమాదంలో తప్పించుకున్నారు మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు . బులోరా వాహనం నడుపుతూ జీవనం కొనసాగించేవాడు మరణ వార్త విన్న కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నియమితం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## వడ్డెల్లి రామారావుకి ఘన సన్మానం



ముదిగొండ మండలం అక్టోబర్ 22 వాయిస్ టుడే : గుర్రాలపాడు జిఆర్ఆర్ జిన్నింగ్ మిల్లో అమ్మపేట తెలుగుదేశం నాయకుడు వడ్డెల్లి రామారావుకి అగ్రికల్చర్ మార్కెట్ చైర్మన్ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి సన్మానం చేయడం జరిగింది. తనకున్న దూర దృష్టి తన వ్యవహరించిన శైలి తాను తెలంగాణలో పత్తి అమ్ముకోవడానికి కపాస్ యాప్ అనేది రైతులకి ఎలా స్లాట్ బుక్ చేసుకోవాలి చుట్టుపక్కల రైతులకి తాను తెలియజేయమని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వడ్డెల్లి రామారావుకి సూచించడం జరిగింది.

## విద్యార్థినితో పరారైన వైనం - సిరిసిల్లలో చర్చనీయాంశం



రాజన్నసిరిసిల్లజిల్లా: అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో విద్యా బుద్ధులు నేర్పిన గురువే.. ప్రేమ పాఠాలు చెప్పాడు.. సభ్య సమాజం.. చదువు సంస్కారం నేర్పించాల్సిన వాడే.. వక్ర మార్గం వైపు నడిపించాడు.. సభ్య సమాజం తలదించుకునేలా చేశాడు.. ఇంటర్ కాలేజీలో ప్రిన్సిపాల్గా పని చేసే ఓ గురువు.. డిగ్రీ చదువుతున్న విద్యార్థినితో పరారైన ఉదంతం రాజన్న జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రిన్సిపాల్ నిర్వాకంపై సిరిసిల్ల ప్రజలు మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సిరిసిల్ల పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తమ కళాశాలలో విద్యనభ్యసించే ఓ విద్యార్థినితో కొంతకాలంగా చనువుగా ఉంటూ వచ్చాడు. ప్రస్తుతం ఆ విద్యార్థిని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో చదువుకుంటుంది. గతంలో ఇంటర్ సమయంలోనే విద్యార్థినినీ ప్రలోభపరిచిన అధ్యాపకుడు ఈసారి ఏకంగా ఆమెతో కలిసి గత రెండు రోజుల క్రితం అదృష్టమైనట్టు సమాచారం. ప్రిన్సిపల్, విద్యార్థిని ఇద్దరూ కనిపించకుండా పోయిన ఘటన జిల్లా వ్యాప్తంతగా సంచలనం రేపుతోంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

## రికార్డు స్థాయిలో కృష్ణమ్మ పరుగులు

**ప్రాజెక్ట్ నుంచి 1,465,టీఎంసీలు విడుదల**

**ప్రాజెక్ట్ 26 గేట్ల ద్వారా అధికంగా నీటి విడుదల**

**18 ఏళ్ల తర్వాత జులై నెలలో నీటి విడుదల**

**వచ్చేనెల వరకూ వర్షాలు కురిసే అవకాశం**



నాగార్జునసాగర్ అక్టోబర్ 22 వాయిస్ టుడే ప్రతినిధి: నాగార్జునసాగర్ జలాశయానికి రికార్డు స్థాయికి ఈ ఏడాది కృష్ణమ్మ పరుగులు తీసింది.రెండు తెలుగు రాష్ట్రాలలో వర్షాకాలం సీజన్ ముందుగానే ప్రారంభం అయింది,జులై నెలలో ప్రారంభమైన అక్టోబర్ వరకు కొనసాగుతూనే ఉంది,

ప్రతి ఏటా గోదావరి బీభత్సం సృష్టిస్తే.ఈ సారి అందుకు భిన్నంగా కృష్ణానది రికార్డు సాయికి చేరింది.గోదావరి వరద ప్రారంభం కాకముందే కృష్ణానది పరుగులు పెట్టింది. కృష్ణా నది పరివాహక ప్రాంతాలలో ఎగువన కురిసిన వర్షాలు రాష్ట్రంలో నమోదైన వర్షపాతం తో కృష్ణ జలాశయాల్లో జలకల సంభవించింది,ఈ నేపథ్యంలో ఊహించని విధంగా ఈసారి కృష్ణా పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులు ముందు గానే కృష్ణమ్మ జలాశయాలకు పరుగులు తీసింది,గోదావరి పరిధిలోని ప్రాజెక్టుల కంటే ముందే గేట్లు తెరుచుకోవడం విశేషం.1984 తరు వాత ఇదే రికార్డు ఫ్లడ్ కాగా కృష్ణమ్మకు ఇంత వరద రావడం రికార్డు అని అధికారులు చెబుతున్నారు.గతంలో 1984 లో 2వేల టీఎంసీలకు పైచిలుకు వరద వచ్చింది.అయితే ఈసారి జూలై నుంచి ఆగస్టు 16 వరకు 1,465,టీఎంసీల వరద నీరు జలాశయానికి చేరుకుంది అంతే కాకుండా మరో నెలరోజుల పాటు వర్షాలున్నాయని వాతావరణ శాఖ చెబు తుండడంతో వరద స్థాయి మరల పెరిగే అవకాశం ఉంది ఎప్పుడూ లేని విధంగా ఈసారి రాష్ట్రంలో మే నెలలోనే వర్గాలు ప్రారంభమయ్యాయి. ఈసారి కృష్ణా,గోదావరికి అనుకున్న స్థాయికంటే ఎక్కువ వరద కొనసాగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి. సైతం అదే స్థాయిలో జరుగుతున్నది. కృష్ణానదిపై గల జూరాల,శ్రీశైలం,నాగార్జున సాగర్,పులిచింతల ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతూనే ఉన్నది.అయితే ఏడాది వరద సీజన్‌లో దాదాపు 18 ఏళ్ల తర్వాత జూలైలోనే గేట్లను ఎత్తారు. అత్యధికంగా మొత్తం 26 గేట్లను ఈ ఏడాది అధికంగా నీటిని దిగువకు విడుదల చేశారు, అందులో భాగంగా ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల ద్వారా 11,13 టీఎంసీలు,తాగు సాగునీటి అవసరాల కోసం ఎడమ కాలువ ద్వారా 46 టీఎంసీలు,కుడి కాలువ ద్వారా 61 టీఎంసీలు ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 245, టీఎంసీల నీటిని విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు ఈ ఏడాది పూర్తిస్థాయిలో,1,465 టీఎంసీల నీటిని దిగువకు విడుదలైనట్లు వెల్లడించారు.

## సిరిసిల్ల జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్)గా గరిమా అగర్వాల్



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ గా గరిమా అగర్వాల్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2019 ఐపీఎస్ బ్యాచ్ కు చెందిన ఆమె ప్రస్తుతం సిద్దిపేట జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులో ఆమె ను నియమించారు.

## ఒకే రోజు 4 లక్షల 25 వేల 3 ఎల్వోసి మంజూరు చేపించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22 : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గనికి చెందిన అయోధ్య పార్వారములు అనారోగ్య సమస్యల వలన అత్యవసర చికిత్స అవసరం ఉన్నదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కి తెలియజేయగానే తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రిలోని వైద్య సిబ్బందితో చర్చలు జరిపి ప్రత్యేకమైన చికిత్స అందించవలసిందిగా ఆదేశిస్తూ మరియు ప్రభుత్వం నుండి 2 లక్షల 50 వెల రూపాయలు, లింగంపల్లి గ్రామానికి చెందిన చిర్ర వేణుకు కు 1 లక్ష దమ్మనపేట గ్రామానికి చెందిన ఆరుట్ల లింగ రెడ్డి 75 వెలు ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు డబ్బులను మంజూరు చేపించారు..కాగ ఎల్ఓసి మంజూరు చేపించడం పట్ల బాధిత కుటుంబ సభ్యుల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కుటుంబ కలహాలవల్ల ఉరి వేసుకొని వ్యక్తి మృతి

చేవెళ్ల...అక్టోబర్ 22(వాయిస్ టుడే) భార్య తన వద్దకు రావడం లేదనే మనస్థాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శంకరపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్వర్తి గ్రామానికి చెందిన శివకుమార్ (22) డ్రైవర్ పనిచేస్తూ మూడు సంవత్సరాల క్రితం కొజ్జ గూడెం గ్రామానికి చెందిన శిరీష అనే యువతిని పెళ్లి చేసుకొనీ,శంకర్ పల్లిలో నివాసం ఉన్నాడు . కొన్ని రోజుల తర్వాత నివాసాన్ని కేసారం గ్రామానికి మార్చాడు. ఏడాది క్రితం శిరీష పాపకు జన్మనిచ్చింది. తల్లి గారి ఇంటి వద్దనే ఉన్న శిరీషను వెల్వర్తికి రావాలని కుటుంబ సభ్యులతోవెళ్లి శివ కుమార్ పలుమార్లు అడిగాడు. శిరీష అతని తీరు నచ్చక అతనితో రావడానికి నిరాకరించింది. శివకుమార్ తన కూతురును చూసేందుకు కొజ్జ గూడెం గ్రామంలో ఉన్న అత్తగారింటికి వెళ్ళాడు. అక్కడికి వెళ్లిన శివ్ కూమార్ భార్య అత్త మామలతో గొడవ పడ్డాడు.తిరిగి తన ఇంటికి వెళ్ళి మనస్థాపానికి గురైన శివకుమార్ తల్లి విజయలక్ష్మి బయట ఉండగా ఇంట్లో కి వెళ్ళి తలుపులు వేసుకొని వాటర్ పైప్ తో సీలింగ్ ఫ్యాన్ కు వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. తలుపులు వేసుకున్నది గమనించిన తల్లి స్థానికుల సహాయంతో గొడ్డలి సహాయంతో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్ కు ఉరివేసుకొని కనిపించాడు. గ్రామస్తుల సహాయంతో ముందుగా శంకర్ పల్లి లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అనంతరం సంగారెడ్డి ఆసుపత్రికి తరలించిన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## చలో ఇందిరాపార్క్ 42 శాతం బిసి రిజర్వేషన్ కల్పించాలి

**24న మహాధర్నాను విజవంతం చేద్దాం**

**ధర్మ సమాజ్ పార్టీ కోనరావుపేట మండల అధ్యక్షుడు అమర్ మహారాజ్**



రాజన్న సిరిసిల్ల జిల్లాబీ అక్టోబర్ 22: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ధర్మసమాజ్ పార్టీ కొనరావుపేట మండల అధ్యక్షుడు అమర్ మహరాజ్ మాట్లాడుతూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో 24 న ఇందిరా పార్క్ దగ్గర హైదరాబాదులో జరగబోయే మహా ధర్నాకు సారాధ్యం వహిస్తున్న ఉమ్మడి ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఈశ్వరయ్య, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవిలు, బీసీ ఎస్సీ ఎస్టీ రైట్స్ అండ్ రాజ్యాధికార సాధన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ నేతృత్వంలో చేయబోయే మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని పిలుపునిచ్చారు. దేశ జనాభాలో 133 కులాలు 60 శాతం ఉన్న బీసీలు కేవలం 27 శాతం రిజర్వేషన్ ని మాత్రమే అనుభవిస్తున్నారు తద్వారా బిసిలుఆర్థికంగా, రాజకీయంగా, విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాలలో అగ్రకుల పార్టీల చేతిలో 70 సంవత్సరాలు దగాపడ్డదని, బిసిలకు న్యాయబద్ధంగా రావాల్సిన 42 శాతం రిజర్వేషన్ ని రాజ్యాంగబద్ధంగా 9వ షెడ్యూల్లో చేర్చితేనే బీసీలకు సంపూర్ణ విముక్తి జరుగుతుందని. ఛలో ఇందిరాపార్క్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కోనరావుపేట మండల బీసీలు, బహుజన సంఘాల వారందరూ మహాధర్నా కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

## హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

**కోహెడ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం**




వాయిస్ టుడే ప్రతినిధి అక్టోబర్ 23 హుస్నాబాద్ ప్రతినిధి బీ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. వివిధ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు సుమారు 130 ,మంది విద్యార్థులు, పాల్గొన్నారు. వారికి పోలీస్ స్టేషన్ ఫంక్షన్, చట్టాలు అమలుపరుస్తున్న తీరు, కేసులు నమోదు, నేరస్తులను పట్టుకోవడం, ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, జరుగుతున్న సైబర్ నేరాల గురించి, పోలీస్ స్టేషన్లో ఉన్న వివిధ గదులు మరియు సీసీ కెమెరాలు ఫంక్షన్, డయల్ 100 ప్రాముఖ్యత, బ్లూ కోర్స్, పెట్రో కార్, పోలీసుల ముఖ్య విధుల గురించి తదితర అంశాల గురించి, పోలీసులు ఉపయోగిస్తున్న నూతన టెక్నాలజీ, సీఈఆర్ ద్వారా ఫోన్లో రికవరీ,కమ్యూనికేషన్ విహెచ్ఎఫ్ సెట్ తదితర అంశాల గురించి అవగాహన కల్పించిన ఎస్ఐలు లక్ష్మారెడ్డి, అభిలాష్, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.